

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 01.06.2026 | సంపుటి: 3 | సంచిక: 119 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 01.06.2026 | VOLUME : 3 | ISSUE : 119 | PAGES: 8 | COST: 2/- |



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# ఐపీఎల్ చాంపియన్ గా ఆర్సీబీ!





- ఫైనల్లో జీటీపై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం
- చెలరేగిన కింగ్ కోహ్లీ.. అజేయ అర్ధ శతకంతో అదుర్స్
- పద్దెనిమిది ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు
- బౌలింగ్ లో అదరగొట్టిన రసిఖ్ సలామ్, భువీ

**అహ్మదాబాద్, మే 31 (రాజముద్ర న్యూస్):**

ఐపీఎల్ ట్రోఫీ కోసం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న ఆర్సీబీ అభిమానుల కల ఎట్టకేలకు సాకారమైంది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో గుజరాత్ టైటాన్స్ పై (జీటీ) ఐదు వికెట్ల తేడాతో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అజేయ అర్ధ శతకంతో చెలరేగడంతో.. 156 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ కేవలం పద్దెనిమిది ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. సమిష్టి కృషితో అదరగొట్టిన బెంగళూరు జట్టు సగర్వంగా ఐపీఎల్ చాంపియన్ గా అవతరించి చరిత్ర సృష్టించింది.

**తడబడిన గుజరాత్ బ్యాటింగ్..**

ఈ మెగా ఫైనల్లో టాస్ గెలిచిన ఆర్సీబీ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో

మిగతా 2వ పేజీలో..


# ముందుగా జీహెచ్ఎంసి..!

ఆ తర్వాతే సీఎంసీ, ఎంఎంసీ
హైదరాబాద్ మహానగర సంస్థల ఎన్నికల నిర్వహణ కసరత్తు ముమ్మరం
ఓటరు సవరణ కార్యక్రమం అక్టోబరు రెండో వారంతో ముగింపు
వెంటనే ఎన్నికల హడావుడి

**హైదరాబాద్, మే31 (రాజముద్ర న్యూస్) :**

హైదరాబాద్ మహానగర పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కసరత్తు ముమ్మరమైంది. కార్పొరేషన్ పునర్విభజన అనంతరం నూతనంగా ఏర్పాటైన మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో... అధికారులు వ్యూహాత్మకంగా మొదటగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోనే ఎన్నికల సమరాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నవంబరు నెలలోనే ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని

మిగతా 2వ పేజీలో..





# చదువుతోనే అభివృద్ధి సాధ్యం

- విద్యా రంగాన్ని విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**కనగల్, మే31(రాజముద్ర న్యూస్):**

చదువుతోనే వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యత

మిగతా 3వ పేజీలో..



## రైతు డిస్కం పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే కుట్ర

- ఉచిత విద్యుత్, మోటార్లకు మీటర్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

3



## వచ్చే ఎన్నికల్లో పొత్తుల వ్యూహం మారుస్తాం

- ఒకటి, రెండు సీట్లు ఇచ్చే పార్టీలతో పొత్తుపెట్టుకోం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

2

## స్వతంత్ర భారత చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం

**పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, మే31(రాజముద్ర న్యూస్):**

స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సొంతింటి కలలను సాకారం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే మార్గదర్శకంగా నిలుస్తోందని గృహ నిర్మాణ, రెవెన్యూ,

మిగతా 3వ పేజీలో..

## రైతు డిస్కం పేరుతో మరో మోసం

- కాంగ్రెస్ హామీలు నమ్మి రైతులు మోసపోయారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**సికింద్రాబాద్, మే 31(రాజముద్ర న్యూస్):**

రైతు డిస్కం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరో మోసానికి తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వ్యవసాయానికి రోజుకు మూడు గంటల విద్యుత్ చాలని

మిగతా 3వ పేజీలో..



## నా పుట్టుక బీఆర్ఎస్‌లోనే.. చావు కూడా బీఆర్ఎస్‌లోనే..

- పార్టీ మారిన వ్యక్తికి నా గురించి మాట్లాడే అర్హత లేదు
- మాజీ మంత్రి హరీశ్ రావు

2

## సింగరేణిలో కార్మిక సంక్షేమానికి కొత్త దిశ

- దేశానికే ఆదర్శంగా రూ.1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా

**హైదరాబాద్, మే31 (రాజముద్ర న్యూస్):**

కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు సింగరేణి యాజమాన్యం దేశంలోనే తొలిసారిగా రూ.1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తూ ఆదర్శంగా నిలిచింది. 2024లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పథకం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

సింగరేణి ఉద్యోగులు జీతాలు పొందుతున్న పలు బ్యాంకులు ఈ పథకంలో భాగస్వామ్యమై ప్రమాద బీమా సదుపాయాన్ని అందిస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్

మిగతా 2వ పేజీలో..



## విజయవంతంగా విద్యాశాఖ బదిలీలు పూర్తి

మొట్టమొదటిసారిగా ఆన్‌లైన్ విధానంలో బోధనేతర సిబ్బంది బదిలీలు

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

3

# ముందుగా జీహెచ్ఎంసి..!

**మొదటిపేజీ తరువాయి**

ప్రాథమిక నిర్ణయానికి వచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కసరత్తులు వేగవంతంగా సాగుతున్నాయి. ఓటరు సవరణ కార్యక్రమం అక్టోబరు రెండో వారంతో ముగియనుండటంతో, ఆ తర్వాతే అసలు ఎన్నికల హడావుడి అధికారికంగా మొదలుకానుంది. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు ఒక స్పష్టమైన కాలపట్టికను రూపొందించుకున్నారు. అక్టోబరులో తుది ఓటరు జాబితా చేతికి వచ్చిన వెంటనే దాని ఆధారంగా ఆయా డివిజన్లలో కొత్తగా ఏర్పడిన ప్రాంతాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తారు. దీంతో పాటు సమాంతరంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వెనుకబడిన తరగతుల సర్వే నివేదికల డేటాను పరిశీలిస్తారు. ఈ సామాజిక ఆర్థిక సర్వే రిపోర్టుల ఆధారంగానే డివిజన్ల వారీగా రిజర్వేషన్లను చట్టబద్ధంగా ఖరారు చేస్తారు. వార్డుల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల వర్గీకరణ, రిజర్వేషన్ల ప్రక్రియ.. ఈ మూడు కీలకమైన ఘట్టాలు అక్టోబరు ఆఖరి నాటికి పూర్తి కానున్నాయి. ఇవన్నీ అనుకున్నట్లు సాగితే నవంబరు మొదటి లేదా రెండో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉందని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.

**జీహెచ్ఎంసీ తర్వాతే...**

రాజధాని పరిధిలో మూడు కార్పొరేషన్లు ఉండగా.. తొలుత ఒక్క జీహెచ్ఎంసీకే ఎన్నికలు నిర్వహించడానికి బలమైన కారణాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని సుమారు 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసి పరిపాలనా సౌలభ్యం కోసం మూడు నూతన కార్పొరేషన్లుగా (జీహెచ్ఎంసి, సీఎంసీ, ఎంఎంసీ) పునర్విభజించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 10 నాటికే పాత జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు ముగిసిపోవడంతో మరుసటి రోజు కొత్తగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లు అధికారికంగా ఉనికిలోకి వచ్చాయి. ఈ మూడు సంస్థలకూ జీహెచ్ఎంసీ చట్టమే వర్తిస్తుంది. ఈ చట్టపరమైన నిబంధనల ప్రకారం.. పాత పాలకమండలి గడువు ముగిసిన ఆరు నెలల లోపల ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధన గతంలో ఉనికిలో ఉన్న పాత జీహెచ్ఎంసీకి మాత్రమే వర్తిస్తుండటం, మిగిలిన రెండు కొత్త సంస్థలు కావడం వల్ల వాటికి కొంత సమయం దొరికింది.

**మారిన రాజకీయ ముఖచిత్రం**

ఈ పునర్విభజన ప్రక్రియ ఓఆర్ఆర్ పరిధిలోని స్థానిక సంస్థల రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసింది. దాదాపు 28 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ మూడు కార్పొరేషన్లలో ఏ పార్టీ ఏ స్థానాన్ని కైవసం చేసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర గందరగోళం, అయోమయం నెలకొన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిని విశ్లేషిస్తే.. జీహెచ్ఎంసీలోని 150 డివిజన్లలో ఒక ప్రధాన పార్టీకి సుమారు 60 నుంచి 70 స్థానాలు దక్కే అనుకూల వాతావరణం ఉంది. మిగిలిన స్థానాల్లో మాత్రం ఊహించని విధంగా త్రిముఖ పోటీ తథ్యమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. మొదట జీహెచ్ఎంసీ ఎన్నికలను నిర్వహించి, అక్కడి ప్రజాభిప్రాయాన్ని, ఓటర్ల మూడ్‌ను క్షుణ్ణంగా విశ్లేషించుకున్న తర్వాతే.. సీఎంసీ, ఎంఎంసీల ఎన్నికలపై ముందడుగు వేయాలని పాలక పక్షం యోచిస్తున్నది.



# కాళేశ్వరంలో జెన్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ ప్రత్యేక పూజలు

**మహాదేవపూర్, మే31:**

సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా జెన్కో సీఎండి కృష్ణ భాస్కర్ శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్. మహేష్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణ స్వాగతం పలికి కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి అభిషేకం పూజలు చేశాక శుభానంద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాద మండపంలో స్వామి వారి శేషవస్త్రాలతో సన్మానం చేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్ మహేష్, చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

**కాళేశ్వరంలో భక్తజన సందోహం..**


**క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు**

మహాదేవపూర్, మే31: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి పుష్కరాల ముగింపులకు ఒకేరోజు మిగిలి ఉండటంతో, ఆదివారం అవటంతో భక్తులు నమస్తే వెంకటేష్ పెద్ద ఎత్తున వచ్చారు. ఎండను దృష్టిలో ఉంచుకొని ఉదయం పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు ప్రధాన ఆలయం వద్ద బారులుతీరారు. మజ్జిగ మంచినీరు వ్యవస్థను వారు ఉచితంగా భక్తులకు అందజేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిరంతరాయంగా జరిపిస్తున్నారు.

భక్తుల రద్దీ పెరగడంతో ఆలయ పరిసరాల్లో మాడ వీధుల్లో వ్యాపారాలు జోరందుకున్నాయి. ఎండ వేడి బాగా ఉండటంతో ఉదయం పూట మరియు సాయంత్రం పుణ్య స్థానాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిస్తూ ఉదయం పూట పూర్ణ స్థానాలు ఆచరించి ప్రధాన ఆలయం దర్శించుకుని ఇళ్లకు బయలుదేరుతున్నారు. మరికొందరు సాయంత్రం పూట కాళేశ్వరం చేరుకొని పుణ్యస్నానమాచరించి గోదావరి హారతిని తిలకించి స్వామి వారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం అవుతున్నారు. మధ్యాహ్నం పూట మిగిలిపోయిన వ్యక్తులు గోదావరి తీరంలోని రద్దులు వేచి ఉండే నివేదికలను నిర్వహించారు అక్కడ అనేక కూలర్లను అమర్చారు. దేవస్థానం ప్రాంగణంలో మరో భక్తుల విశ్రాంతికి వేదిక ఏర్పాటు చేశారు. దీంతో అనేకమంది భక్తులు చలువ పందిళ్ళ కింద భక్తుల విశ్రాంతి కోసం ఏర్పాటుచేసిన టెంట్ల కింద పగలంతా విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రైవేటు వాహనాల్లో కూడా పెద్ద ఎత్తున భక్తులు గోదావరి హారతి కోసం తరలివస్తు రాత్రిపూట ఇళ్లకు చేరుకుంటున్నారు. ప్రతి రోజు ఒక స్వామీజీ రావటంతో గోదావరి తీరంలో సందడి మేలుకుంటున్నది. స్వామీజీలకు ఏర్పాటు చేసిన విడిది త్రివేణి గెస్ట్ హౌస్ లో అనేకమంది భక్తులు స్వాములను దర్శించుకోవడం పరిపాటిగా మారింది. గోదావరి తీరంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లు బోట్లలో నిత్యం పహరాకాస్తున్నారు. గోదావరి తీరంలో ఆలయ ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల కేంద్రాలను భక్తులు అస్వస్థకు గురైన వారు చికిత్స చికిత్స వందుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది గట్టి చర్యలు చేపట్టారు. మంత్రి శ్రీధర్ బాబు పర్యవేక్షణలో బసతీయుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎస్పి సిరి శెట్టి సంకీర్త, దేవాదాయ శాఖ అధికారులు, డి ఎం అండ్ హెచ్ ఓ మధుసూదన్ లు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.ప్రతి చోట మంచినీటి సదుపాయం కల్పించిన మిషన్ భగీరథఅధికారుల భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. అధికారులు జాగ్రత్తలు నిర్వహించారు.==







# ఐపీఎల్ చాంపియన్ గా ఆర్సీబీ!

**మొదటిపేజీ తరువాయి**

బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆర్సీబీ బౌలర్ల కచ్చితమైన బంతుల ధాటికి గుజరాత్ బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోయారు. వాషింగ్టన్ సుందర్ ఒక్కడే 37 బంతుల్లో అజేయంగా 50 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. నిశాంత్ సింధు 18 బంతుల్లో 20 పరుగులు, జోస్ బట్లర్ 23 బంతుల్లో 19 పరుగులు చేసి పెవిలియన్ చేరారు. బెంగళూరు బౌలర్లలో రసిఖ్ సలామ్ నాలుగు ఓవర్లలో కేవలం 27 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు, జోష్ హేజిల్ వుడ్ రెండు వికెట్లు తీసి గుజరాత్ బ్యాటింగ్ లైనప్ ను దెబ్బతీశారు.

**కోహ్లీ మాస్టర్ క్లాస్.. అయ్యర్ మెరుపులు..**

అనంతరం 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఆరంభంలోనే ఇబ్బందులు ఎదురైనా.. విరాట్ కోహ్లీ అద్భుత ఇన్నింగ్స్ తో జట్టును ఆదుకున్నాడు. 42 బంతులు ఎదుర్కొన్న కోహ్లీ 75 పరుగులతో నాటౌట్ గా నిలిచి ఒంటిచేత్తో మ్యాచ్ ను విజయతీరాలకు చేర్చాడు. అతనికి తోడుగా వెంకటేష్ అయ్యర్ కేవలం 16 బంతుల్లోనే 32 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో టిమ్ డేవిడ్ 17 బంతుల్లో 24 పరుగులు జోడించడంతో ఆర్సీబీ విజయం ఖాయమైంది. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ రెండు వికెట్లు పడగొట్టగా.. అర్షద్ ఖాన్, మహ్మద్ సిరాజ్ తలా ఒక వికెట్ తీశారు. కోహ్లీ అద్భుత ఆటతీరుతో ఇంకా 12 బంతులు మిగిలి ఉండగానే ఆర్సీబీ విన్నింగ్ షాట్ కొట్టి దర్జాగా కప్పును ముద్దాడింది.

# వచ్చే ఎన్నికల్లో పొత్తుల వ్యూహం మారుస్తాం

**తెలంగాణ బ్యూరో, మే31 :**



వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టుల పొత్తుల వ్యూహం పూర్తిగా మారుస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు వెల్లడించారు. ఇకపై ఒకటి, రెండు సీట్లు ఇచ్చే పార్టీలతో మేము పొత్తులు పెట్టుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గౌరవప్రదంగా కనీసం ఐదు సీట్లకు తగ్గకుండా ఇచ్చే పార్టీలతోనే రాబోయే ఎన్నికల్లో పొత్తులు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో మినహా, మిగిలిన అన్ని సమయాల్లో కమ్యూనిస్టులంతా (సీపీఐ, సీపీఎం తదితర శ్రేణులు) ఎప్పుడూ కలిసే ఉంటామన్న కూనంనేని ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాడతామని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజలకు ఉపయోగపడే, ప్రజా శ్రేయస్సు కోరే రాజకీయాలు మాత్రమే చేస్తారని కూనంనేని గుర్తుచేశారు. వ్యక్తిగత స్వార్థం, లాభాల కోసం కమ్యూనిస్టులు ఎన్నడూ రాజకీయం చేయరని.. ఒకవేళ ఎవరైనా తమ స్వార్థం కోసం రాజకీయం చేయాలని చూస్తే, వారు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగడానికి ఎంతమాత్రం అర్హులు కారని ఆయన హెచ్చరించారు.

**తెలంగాణలో బీజేపీ అధికారంలో రాదు.**

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎప్పటికీ అధికారంలోకి రాలేదని జోస్యం చెప్పారు. కేవలం సెంటిమెంట్, భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలు మాత్రమే బీజేపీకి వచ్చన్నారు. కానీ అలాంటి విన్యాసాలు తెలంగాణలో అస్సలు పని చేయవని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టుల కంచుకోట అయిన ఖమ్మం జిల్లాలో బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "ఒకవేళ ఖమ్మంలో బీజేపీ ఒక్క సీటైనా గెలిస్తే.. నేను ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి.. రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను" అంటూ సవాల్ చేశారు.

# నా పుట్టుక బీఆర్ఎస్‌లోనే.. చావు కూడా బీఆర్ఎస్‌లోనే

**సిద్దిపేట, మే 31:**

తాను జీవితాంతం బీఆర్ఎస్ పార్టీతోనే ఉంటానని, ఈ విషయాన్ని వందసార్లు చెప్పానని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. అదే విషయాన్ని మరో వందసార్లు చెప్పడానికి కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు. తన పుట్టుక బీఆర్ఎస్‌లోనే జరిగిందని, చావు కూడా బీఆర్ఎస్‌లోనే ఉంటుందని ప్రకటించారు. ఆదివారం సిద్ధిపేటలో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వ్యక్తి రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. నాలుగు పార్టీలు మారిన వ్యక్తికి తన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. రేవంత్ రెడ్డి మాటలకు విశ్వసనీయత లేదని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ పార్టీలో ఉంటూ మోడీ, బీజేపీ పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేపు ఆయన ఏ పార్టీలో ఉంటారో కూడా చెప్పలేని పరిస్థితి ఉందని అన్నారు. తాను మాత్రం బీఆర్ఎస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నానని, పార్టీతో తన అనుబంధం జీవితాంతం కొనసాగుతుందని హరీశ్ రావు స్పష్టం చేశారు





# సింగరేణిలో కార్మిక సంక్షేమానికి కొత్త దిశ

**మొదటిపేజీ తరువాయి**

బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా అందిస్తుండగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్‌లు రూ.1 కోటి ప్రమాద బీమా కల్పిస్తున్నాయి. సింగరేణిలోని 40,275 మంది ఉద్యోగులు ఈ పథకం పరిధిలోకి వచ్చారు.

ఈ బీమా కోసం ఉద్యోగులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకపోవడం విశేషం. సాధారణంగా ప్రమాద బీమా పథకాలలో సభ్యులు ప్రీమియం చెల్లించాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో పూర్తిగా ఉచితంగా ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీంతో కార్మికులు, కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

**బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా**

ప్రమాదాల్లో ఉద్యోగులు మృతి చెందినప్పుడు వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటాయి. అలాంటి సమయంలో రూ.1 కోటి నుంచి రూ.1.25 కోట్ల వరకు బీమా సాయం అందడం వల్ల కుటుంబాలకు గణనీయమైన ఆర్థిక భరోసా లభిస్తోంది. గత రెండేళ్లలో వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన 32 మంది ఉద్యోగుల కుటుంబాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుమారు రూ.28 కోట్లు, 13 మంది కుటుంబాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుమారు రూ.13 కోట్లు చెల్లించింది.

**వికలాంగులకూ బీమా వర్తింపు**

ప్రమాదాల్లో మృతి చెందిన వారికే కాకుండా చేతులు, కాళ్లు కోల్పోయిన వారు లేదా శాశ్వత, పాక్షిక అంగవైకల్యానికి గురైన ఉద్యోగులకు కూడా ఈ బీమా వర్తిస్తోంది. ఇటీవల శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన కార్మికుడు సత్యనారాయణ గని ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోగా, బీమా పథకం కింద రూ.1 కోటి సాయం అందించారు.

**సహజ మరణానికీ ఉచిత బీమా**

ప్రమాద బీమాతో పాటు సహజ మరణానికి కూడా రూ.10 లక్షల ఉచిత బీమా సదుపాయాన్ని పలు బ్యాంకులు అమలు చేస్తున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.10 లక్షల వరకు బీమా అందిస్తుండగా, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.15 లక్షల వరకు సహజ మరణ బీమా కల్పిస్తోంది. దీనికీ ఉద్యోగులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు.

**దేశవ్యాప్తంగా విస్తరించిన నమూనా**

సింగరేణిలో ప్రారంభమైన ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదట విద్యుత్ సంస్థలకు, అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు విస్తరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ తరహా బీమా సదుపాయం వర్తింపజేయడం ద్వారా తెలంగాణ నమూనా దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది.

**ఆరోగ్య బీమా సదుపాయం**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో కార్పొరేట్ శాలరీ ఖాతాలు కలిగిన ఉద్యోగులకు రూ.50 లక్షల ఆరోగ్య బీమా కూడా అందుబాటులో ఉంది. ఉద్యోగి, జీవిత భాగస్వామి, 25 ఏళ్ల లోపు ఇద్దరు పిల్లలకు ఏడాదికి రూ.8,906 ప్రీమియంతో ఈ బీమా వర్తిస్తుంది. 63 ఏళ్ల వయస్సు వరకు ఈ సదుపాయం కొనసాగుతుంది.

**పొరుగు సేవల సిబ్బందికీ రక్షణ**

సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 30 వేల మంది పొరుగు సేవల సిబ్బందికి కూడా ప్రమాద బీమా సదుపాయం కల్పించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.40 లక్షలు, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ రూ.30 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నాయి. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్టీపీపీ ఉద్యోగి కంబాల రాజేష్ కుటుంబానికి రూ.50 లక్షల బీమా సాయం అందడం ఈ పథకం ప్రాధాన్యతను చాటింది.

**విశ్రాంత ఉద్యోగులకూ వర్తింపు**

పదవీ విరమణ అనంతరం కూడా ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పింఛన్‌ను సంబంధిత బ్యాంకుల ద్వారా పొందే విశ్రాంత ఉద్యోగులకు రూ.30 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ఉచిత ప్రమాద బీమా వర్తింపజేయడానికి పలు బ్యాంకులు అంగీకరించాయి.

సింగరేణి కార్మికుల జీవిత భద్రత, ఆరోగ్య భద్రతకు ఒకేసారి భరోసా కల్పిస్తున్న ఈ పథకం కార్మిక సంక్షేమ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కార్మిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# రైతు డిస్కం పేరుతో మరో మోసం

మొదటిపేజీ తరువాయి

గతంలో చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

ఆదివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం గజ్జెల నగేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు మద్దతు లభించినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారని అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరిస్తుంటే తెలంగాణలో మాత్రం అధికారంలోకి తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు.

**అప్పులు చేసి అభివృద్ధి చేశాం**

కేసీఆర్ హయాంలో తీసుకున్న అప్పులను అభివృద్ధి కోసం వినియోగించామని కేటీఆర్ తెలిపారు. లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించామని, 15 లక్షల మంది ఆడపడుచులకు కల్యాణలక్ష్మి ద్వారా సాయం అందించామని, కాళేశ్వరం ప్రాజెక్టుతో 50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. రైతుబంధు, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తు చేశారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో నాలుగు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి ఏ అభివృద్ధి చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. జీవో 58 ద్వారా కేసీఆర్ ప్రభుత్వం లక్షలాది మందికి పట్టాలు అందించిందని, ప్రస్తుత ప్రభుత్వం ఒక్క ఇంటి పట్టా కూడా ఇవ్వలేదని విమర్శించారు. రైతుబంధు లేకుండా పోయిందని, రైతు రుణమాఫీ పూర్తికాలేదని, ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతుల ధాన్యం కొనడానికి నిధులు లేకపోయినా, డబ్బు సంచులు మాత్రం ఢిల్లీకి వెళ్తున్నాయని ఎద్దేవా చేశారు.

**ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి**

జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో 95 లక్షల ఓట్లు, బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో సైనిక భూముల్లో నివసించే 35 వేల మంది ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందని అన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు బీఆర్ఎస్ పోరాడుతుందని హామీ ఇచ్చారు.

**ప్రశ్నిస్తే అక్రమ కేసులు**

సమావేశంలో మాట్లాడిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. బాల్క సుమన్‌పై కేసు పెట్టి జైలుకు పంపారని విమర్శించారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, అప్పుడు ప్రజలకు అన్ని విషయాల్లో సమాధానం చెబుతామని అన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు ఉచిత మంచినీటి సరఫరా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషిని చెరిపివేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

కంటోన్మెంట్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మన్నె క్రిశాంక్ మాట్లాడుతూ యువతకు పార్టీలో అవకాశాలు కల్పించాలని సూచించారు. పార్టీకి కొత్త రక్తం అవసరమని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్టీ నాయకురాలు నివేదిత, జక్కుల మహేశ్వర్ రెడ్డి, టీఎన్ శ్రీనివాస్, పాండు యాదవ్, లోకనాథం, అనిత, నళిని, శ్యాంకుమార్, ఆకుల రూప తదితరులు పాల్గొన్నారు.





## చదువుతోనే అభివృద్ధి సాధ్యం

మొదటిపేజీ తరువాయి

ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు తిప్పర్తి, కనగల్ మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఎంజీ యూనివర్సిటీలో అడుగుపెట్టలేదని మండిపడ్డారు. తాను హెలికాప్టర్‌లో తిరిగినా, కారులో తిరిగినా, బండిపై తిరిగినా జిల్లా అభివృద్ధి కోసమేనని స్పష్టం చేశారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 300 ఎకరాల్లో ఎంజీ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎంజీ యూనివర్సిటీ రాష్ట్రంలోనే ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నిలిచిందన్నారు.

ఈ విద్యా సంవత్సరం నుంచి ఫార్మసీ, డి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీ.ఫార్మసీ, ఎల్ఎల్బీ కోర్సులు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు.

ఎస్ఎల్బీసీ సొరంగ పనుల్లో 80 శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. సొరంగం పూర్తయితే రెండు పంటలకు సాగునీరు అందుతుందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్బీసీని పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించిందని, అయితే దురదృష్టవశాత్తు సొరంగం కూలి ఎనిమిది మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతతో మరో కిలోమీటరు మేర సొరంగ పనులు పూర్తి చేశామని, ప్రాజెక్టును కచ్చితంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

ధర్వేశిపురం నుంచి కనగల్, గుర్రంపోడు, దేవరకొండ మీదుగా దిండి వరకు రూ.13,600 కోట్లతో హైబ్రిడ్ యాన్యుటి మోడల్‌లో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో టెండర్ ప్రక్రియ పూర్తైందన్నారు. వచ్చే నెల 13 లేదా 14న కనగల్‌గుర్రంపోడు మధ్య 100 ఎకరాల స్థలంలో బహిరంగ సభ నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే దశకు చేరుకున్నాయని పేర్కొన్న మంత్రి, బీజేపీ బస్సు యాత్రలు చేయడం కంటే ఢిల్లీకి పాదయాత్ర చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, రూ.450 కోట్లతో ఎస్ఎల్బీసీ కాలువ లైనింగ్ పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, చిట్ల వెంకటేశం, ఆర్టీఏ డైరెక్టర్ కుసుకుంట్ల రాజిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బిక్షం యాదవ్, ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ దేవాలయ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి, స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురళీధర్, గోలి నర్సిరెడ్డి, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్‌కు బిగ్ షాక్..

- **14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి మెజిస్ట్రేట్**

హైదరాబాద్, మే 31:

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్ విధించారు. శనివారం అర్ధరాత్రి సుమన్‌ను నాంపల్లి పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. నిన్న మధ్యాహ్నం పోలీసులు తెలంగాణ భవన్‌లో సుమన్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సింగరేణి కార్యాలయాలు, రైలు పట్టాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో సింగరేణి అధికారులు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాళ్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నాంపల్లి పోలీసులు తెలిపారు. బాల్క సుమన్‌పై సెక్షన్స్ 326(g), 351(3), 353(1)(b), r/w 55, r/w 61(2)(a) BNS, 4 PDPPA యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ సింగరేణి ఆస్తులు ధ్వంసం చేయాలని, వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో వాదనలు విన్న అనంతరం బాల్క సుమన్‌కు 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ నాంపల్లి మెజిస్ట్రేట్ నిర్ణయం తీసుకుంది.

ఇక తన అరెస్ట్ అంశంపై ఇప్పటికే బాల్క సుమన్ స్పందించారు. తాను మాట్లాడుతున్నాను. ప్రశ్నిస్తున్నాను కాబట్టి తన గొంతు నొక్కాలే, అరెస్టు చేసి జైల్లో వేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. "నిర్బంధం విధించి తద్వారా పైశాచిక ఆనందం పొందాలనే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల్లో కనబడుతుంది. ఇప్పుడు ఉద్యోగాలు ఇచ్చే పని మీద దృష్టి పెట్టండి. ఇళ్ల పట్టాలు ఇవ్వండి. మూడేళ్లలో ఎవ్వరికీ ఒక్క పట్టా కూడా ఇవ్వలేదు. సింగరేణిలో రూ.15 వేల కోట్ల కుంభకోణం చేశారు. రూ.1600 కోట్ల విలువైన బొగ్గును మాయం చేశారు. సింగరేణిలో సంక్షేమ కార్యక్రమాలు అమలు కావట్లేదు. కొత్త మైన్స్ లేవు.

## స్వతంత్ర భారత చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం

మొదటిపేజీ తరువాయి

సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా పేద కుటుంబాల జీవితాలను మార్చే సామాజిక ఉద్యమంగా మారిందన్నారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.

జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా కరమెరి మండలం కొఠారి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. అదే రోజు కొత్తగూడలో సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని చెప్పారు. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్ల మంజూరుతో రెండు విడతల్లో కలిపి ఒక్కో నియోజకవర్గానికి 5,500 నుంచి 6,500 ఇళ్ల వరకు మంజూరైనట్లు అవుతుందని పేర్కొన్నారు. గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 1,500 ఇళ్ల వరకు కేటాయించినట్లు తెలిపారు.

గత ఏడాది ఫిబ్రవరిలో నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసిన తర్వాత 13 నెలల్లో లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తైందని, మరో ఒకటి రెండు నెలల్లో మరో రెండు లక్షల ఇళ్లు పూర్తికానున్నాయని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

202627 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం 3.50 లక్షల ఇళ్ల మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో నగర ప్రాంతాల్లో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేయనున్నట్లు



చెప్పారు. తొలి విడతలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకొని రెండో విడతను మరింత పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

దేశంలోని చాలా రాష్ట్రాలు కేంద్రం అందించే పరిమిత నిధులతోనే గృహ నిర్మాణాలు చేపడుతున్నాయని, తెలంగాణ మాత్రం పేదవాడి ఇల్లు ప్రభుత్వ బాధ్యత అనే లక్ష్యంతో స్వంత నిధులతో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం రూ.72 వేలే, పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుండగా తెలంగాణ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు సహాయం అందిస్తామని తెలిపారు. అలాగే 2023లో గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరై ఇప్పటికీ పూర్తి కాని లబ్ధిదారులకు కూడా అవసరమైన ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. పాత ఇందిరమ్మ పథకంలో రూ.20 వేల వరకు ఆర్థిక సాయం పొందిన వారికి కూడా రెండో విడతలో ఇళ్ల మంజూరు చేసే నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

## విజయవంతంగా విద్యాశాఖ బదిలీలు పూర్తి

హైదరాబాద్, మే 31:

పాఠశాల విద్యాశాఖలో అధికారుల, బోధనేతర సిబ్బంది బదిలీల ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం విజయవంతంగా పూర్తైనట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 38లో పేర్కొన్న సమగ్ర మార్గదర్శకాల మేరకే బదిలీలు నిర్వహించినట్లు ఆదివారం వెల్లడించారు. పాఠశాల విద్యాశాఖ చరిత్రలోనే తొలిసారిగా బోధనేతర సిబ్బంది బదిలీలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించినట్లు తెలిపారు. అడిషనల్ డైరెక్టర్ స్థాయి నుంచి ఆఫీస్ సబోర్డినేట్ స్థాయి వరకు జిల్లా, జోనల్, మల్టీ జోనల్, రాష్ట్ర కేడర్‌కు చెందిన అన్ని బదిలీలను విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అత్యున్నత స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అన్ని విభాగాలకు చెందిన అధికారుల, బోధనేతర సిబ్బంది బదిలీలు పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. అడిషనల్ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబోర్డినేట్ల బదిలీలు పూర్తైనట్లు వివరించారు. పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యం ఇస్తూ బదిలీల ప్రక్రియను చేపట్టామని నవీన్ నికోలస్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా బదిలీలను పూర్తి చేయడం విద్యాశాఖకు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందన్నారు. బదిలీల ప్రక్రియ విజయవంతం కావడంలో సహకరించిన అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.



## రైతు డిస్కం పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే కుట్ర

హైదరాబాద్, మే31:

రైతు డిస్కం పేరుతో కొత్త విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేసి, ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంలను ప్రైవేటీకరించే కుట్రను రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

రైతు డిస్కం వల్ల ఉచిత విద్యుత్‌కు ముప్పు వాటిల్లడంతో పాటు వ్యవసాయ మోటార్లకు మీటర్లు అమర్చే పరిస్థితి వస్తుందని అన్నారు. ప్రభుత్వం అలాంటి ఆలోచన లేదంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిట్‌చాట్‌లలో కాకుండా అధికారిక విలేకరుల సమావేశం నిర్వహించి ప్రజలకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ప్రెస్‌మీట్ పెట్టి చెప్పే ధైర్యం ఉందా?**

రైతు డిస్కం అంశాన్ని ఆరు నెలల పాటు రహస్యంగా ఉంచి ఇప్పుడు చిట్‌చాట్‌ల ద్వారా వివరణలు ఇస్తున్నారని కవిత విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయని ముఖ్యమంత్రి ఇప్పుడు చెబుతున్న మాటలను ప్రజలు ఎలా నమ్మాలని ప్రశ్నించారు.

రైతు భరోసా పథకాన్ని పరిమితం చేశారని, రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, ధాన్యం కొనుగోళ్లలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతు బీమా పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. ఈ కారణాల వల్లే ముఖ్యమంత్రి హామీలపై రైతాంగంలో అనుమానాలు పెరిగాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిజంగా ప్రైవేటీకరణ ఆలోచన చేయకపోతే డిస్కంలను ప్రైవేటీకరిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లబోమని ప్రకటించే ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు.

**రైతు డిస్కంను అడ్డుకుంటాం**

రైతులకు నష్టం కలిగించే రైతు డిస్కం ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి తిరస్కరించాలని కవిత కోరారు. కొత్త డిస్కంలో రైతులే ప్రధాన వినియోగదారులు కాబట్టి వారి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఈఆర్సీ అనుమతి ఇచ్చినా న్యాయపోరాటం చేస్తామని, ఇప్పటికే తెలంగాణ జాగృతి తరఫున కేసు దాఖలు చేసినట్లు తెలిపారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి రైతు డిస్కం ఏర్పాటును అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

**చిన్న పరిశ్రమలకు నష్టం**

విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని కవిత ఆరోపించారు. సోలార్ ప్యానెల్లు, బ్యాటరీల తయారీకి సంబంధించిన తాజా నిబంధనల వల్ల చిన్న, మధ్య తరహా సంస్థలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు.

కొద్ది పెద్ద సంస్థలకే లాభం చేకూరేలా విధానాలు రూపొందుతున్నాయని విమర్శించారు. లక్షలాది చిన్న వ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం చూపే నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆందోళనకు సిద్ధమవుతున్న చిన్న వ్యాపారులకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు.



**పాలమూరు ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి**

పాలమూరు ప్రాజెక్టు పనులను ప్రభుత్వం వేగవంతం చేయాలని కవిత కోరారు. దసరా నాటికి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలా జరగకపోతే తాను పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు.

కుమ్మెర గ్రామంలో కులవివక్ష కారణంగా పసికందు మరణించిన ఘటనలో బాధిత కుటుంబాన్ని ముఖ్యమంత్రి పరామర్శించి న్యాయం చేయాలని కోరారు.

**హైడ్రా వ్యవహారంపై విమర్శలు**

హైడ్రా చర్యలపై కోర్టులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కవిత విమర్శించారు. పెద్దల అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా పేదల ఇళ్లను మాత్రమే కూల్చుతున్నారని ఆరోపించారు. తాను ఇచ్చిన ఫిర్యాదులపై కూడా హైడ్రా స్పందించలేదని పేర్కొన్నారు.

**ఖమ్మం చిన్నారికి న్యాయం చేయాలి**

ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స సమయంలో చిన్నారి చేయి తొలగించాల్సి వచ్చిన ఘటనపై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, చిన్నారి పేరుపై రూ.25 లక్షల నిధిని డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.




# ఉపరాష్ట్రపతి చేతులమీదుగా మాతృశ్రీ పార్కు ప్రారంభం

## గ్రామీణాభివృద్ధికి కొత్త ఊతం

## మహిళా సాధికారతకు ప్రోత్సాహం

**బెళ్తంగడి, మే 31:** కర్ణాటకలోని బెళ్తంగడిలో ఏర్పాటు చేసిన సిరి మాతృశ్రీ పారిశ్రామిక పార్కును భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారతకు ఈ పార్కు కీలకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ గ్రామీణ భారతదేశాన్ని సుసంపన్నంగా తీర్చిదిద్దే కలను సాకారం చేయడంలో సిరి వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఉపాధి అవకాశాల కల్పన, స్వయం ఉపాధి ప్రోత్సాహం ద్వారా వేలాది మహిళలు, గ్రామీణ కుటుంబాల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. మహిళల సాధికారత దేశ అభివృద్ధికి బలమైన పునాది అని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు. పారిశ్రామిక పార్కులు గ్రామీణ ప్రాంతాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, రాజ్యసభ సభ్యుడు, సిరి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ డి. వీరేంద్ర హెగ్గడే, లోక్‌సభ సభ్యుడు బృజేష్ చౌటా, సిరి సంస్థ వ్యవస్థాపకురాలు హేమావతి వి. హెగ్గడే పాల్గొన్నారు. ప్రముఖులు పార్కు ఏర్పాటును అభినందించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యాలతో సిరి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని సభలో పలువురు అభిప్రాయపడ్డారు. ఈ పారిశ్రామిక పార్కు ద్వారా స్థానిక ప్రజలకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు.

# మైనర్లను వ్యభిచారంలోకి దింపితే పోక్సో వర్తింపు

## సుప్రీంకోర్టు కీలక తీర్పు.. అక్రమ రవాణాపై కఠిన హెచ్చరిక



**న్యూఢిల్లీ, మే 31:** మైనర్ బాలికలను వ్యభిచారంలోకి దింపేందుకు లేదా లైంగిక దోపిడీ కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించినా పోక్సో చట్టం వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లైంగిక దాడి జరిగిన తర్వాత మాత్రమే పోక్సో అమలవుతుందనే అభిప్రాయం సరైంది కాదని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. మైనర్ల అక్రమ రవాణాకు సంబంధించిన ఓ కేసులో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. వ్యభిచారం లేదా కమర్షియల్ సెక్స్ కోసం మైనర్ బాలికలను తరలిస్తున్నట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు పోక్సో చట్టంలోని నిబంధనలను వర్తింపజేయడం పూర్తిగా చట్టబద్ధమేనని ధర్మాసనం పేర్కొంది. మైనర్లను లైంగిక దోపిడీ నుంచి రక్షించడమే పోక్సో చట్టం ప్రధాన ఉద్దేశమని, అందువల్ల నేరం పూర్తిగా జరిగే వరకు వేచి చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇంతకుముందు కర్ణాటక హైకోర్టు, మైనర్ బాలికలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం మాత్రమే జరిగితే అది భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ), అనైతిక రవాణా నిరోధక చట్టం పరిధిలోకి వస్తుందని, లైంగిక దాడి జరిగిన తర్వాతే పోక్సో వర్తిస్తుందని పేర్కొంది. అయితే ఆ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. మైనర్లను వ్యభిచారంలోకి నెట్టే ప్రయత్నాలు అత్యంత ఘోరమైన నేరాలని, అలాంటి కార్యకలాపాలను ప్రారంభ దశలోనే అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని ధర్మాసనం సూచించింది. మైనర్ల అక్రమ రవాణా, లైంగిక దోపిడీ కేసుల్లో ఈ తీర్పు కీలక మార్గదర్శకంగా నిలవనుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో మైనర్లను వ్యభిచారంలోకి దింపే ముఠాలపై మరింత కఠిన చర్యలకు మార్గం సుగమం కానుంది.

# పెళ్లి మాటతో 14.8 లక్షల మోసం

## మ్యాట్రిమోనియల్ పరిచయం పేరుతో మహిళకు టోకరా

**నాగపూర్ :** మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఓ 31 ఏళ్ల మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.14.8 లక్షలు కాజేసిన ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. మ్యాట్రిమోనియల్ సైట్ ద్వారా పరిచయమైన రాఘవేంద్ర కిషోర్ అవస్థి (36) అనే వ్యక్తి.. తన భార్య చనిపోయిందని అబద్ధం చెప్పి బాధితురాలి నమ్మకాన్ని చూరగొన్నాడు. త్వరలోనే వివాహం చేసుకుంటానని నమ్మబలికి ఆమెను పలుమార్లు లైంగికంగా దుర్వినియోగం చేశాడు. అనంతరం తాను కొత్తగా జిమ్ వ్యాపారం ప్రారంభించాల్సి ఉందంటూ పెట్టుబడి పేరుతో బాధితురాలి నుంచి విడతల వారీగా రూ.14.8 లక్షలు వసూలు చేశాడు. ఆ తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతుండటంతో పాటు, అతడి భార్య ఇంకా బతికే ఉందని తెలియడంతో బాధితురాలు షాక్‌కు గురైంది. నిందితుడు తనను మానసికంగా వేధించాడని, శారీరకంగానూ దాడికి పాల్పడ్డాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నాగపూర్ పోలీసులు నిందితుడు రాఘవేంద్ర కిషోర్‌పై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ వంచనలో నిందితుడికి అతడి కుటుంబ సభ్యులు కూడా సహకరించినట్లు ఆరోపణలు రావడంతో, పోలీసులు వారి పాత్రపై కూడా విచారణ జరుపుతున్నారు. నిందితుడి బ్యాంక్ ఖాతాలు, ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నామని పోలీస్ అధికారులు వెల్లడించారు.

# బ్రహ్మోస్‌కు పెరుగుతున్న డిమాండ్

- వియత్నాంతో కీలక ఒప్పందం
- ఇండోనేషియాతో తుది చర్చలు
- రక్షణ ఎగుమతుల్లో ముందడుగు




సింగపూర్, మే 31: భారత రక్షణ రంగానికి మరో కీలక విజయం దక్కింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు పొందిన బ్రహ్మోస్‌ను వియత్నాంకు విక్రయించేందుకు భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియాతో కూడా తుది దశకు చేరుకున్నట్లు భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. సింగపూర్‌లో నిర్వహించిన షాంగ్రీ-లా భద్రతా సదస్సులో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పందంపై ఇప్పటికే సంతకాలు పూర్తయ్యాయని రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు. అధికారిక ప్రకటన వెలువడకపోయినా ఒప్పంద ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఈ ఒప్పందం విలువ సుమారు రూ.5,800 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగా తీరప్రాంత రక్షణ క్షిపణి వ్యవస్థలు, తొలి విడత క్షిపణులు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక సహకారం కూడా అందించనున్నారు. ఇండోనేషియాతో చర్చలు కూడా వేగంగా సాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య మిగిలిన అంశాలపై సంప్రదింపులు ముగింపు దశలో ఉన్నాయని, త్వరలోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఆగ్నేయాసియా ప్రాంతంలో భారత రక్షణ ఉత్పత్తులకు మరింత మార్కెట్ లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు భారీ ఒప్పందం కుదుర్చుకుంది. దాంతో భారతదేశం నుంచి బ్రహ్మోస్ కొనుగోలు చేసిన తొలి విదేశంగా ఫిలిప్పీన్స్ నిలిచింది. ఇప్పుడు వియత్నాం కూడా ఆ జాబితాలో చేరగా, ఇండోనేషియా త్వరలో చేరే అవకాశాలు ఉన్నాయి. చైనాతో సముద్ర సరిహద్దు వివాదాలు ఎదుర్కొంటున్న దేశాలు తమ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకునేందుకు బ్రహ్మోస్‌పై ఆసక్తి చూపుతున్నాయి. ధ్వని వేగం కన్నా మూడు రెట్లు అధిక వేగంతో ప్రయాణించే బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గాలి, సముద్రం నుంచి ప్రయోగించే సామర్థ్యం ఉంది. శత్రు యుద్ధనౌకలు, కీలక సైనిక స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకుని దాడి చేయగలదు. దీని వేగం, ఆధునిక సాంకేతికత కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను 2030 నాటికి రూ.50,000 కోట్లకు పెంచాలనే లక్ష్యంతో భారత్ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో బ్రహ్మోస్ ఒప్పందాలు భారత రక్షణ పరిశ్రమకు కొత్త అవకాశాలు తెరుస్తున్నాయి. మలేషియా, థాయ్‌లాండ్ వంటి ఇతర ఆగ్నేయాసియా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. దీంతో అంతర్జాతీయ రక్షణ మార్కెట్‌లో భారత స్థానం మరింత బలపడే అవకాశం కనిపిస్తోంది.

# సీడీఎస్‌గా రాజా సుబ్రమణి

## జాతీయ భద్రతే ప్రాధాన్యం

## సైనిక సంస్కరణలకు వేగం

## ఉమ్మడి సమన్వయంపై దృష్టి





**న్యూఢిల్లీ, మే 31 :** భారత ప్రధాన రక్షణ దళాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి దేశ సార్వభౌమాధికార పరిరక్షణ, జాతీయ భద్రత బలోపేతంపై రక్షణ దళాల అచంచల నిబద్ధతను పునరుద్ఘాటించారు. దేశ భద్రతకు సంబంధించిన అన్ని అంశాల్లో రక్షణ దళాలు మరింత సమర్థవంతంగా పనిచేస్తాయని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడిన జనరల్ రాజా సుబ్రమణి, సైనిక వ్యవస్థలో మార్పులను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు రక్షణ దళాలను మరింత ఆధునికంగా తీర్చిదిద్దడం అవసరమని పేర్కొన్నారు. భూ, నౌకా, వాయుసేనల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా ఉంటుందని ఆయన వెల్లడించారు. ఉమ్మడి కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా దేశ రక్షణ వ్యవస్థ మరింత పటిష్ఠమవుతుందని అభిప్రాయపడ్డారు. సైనిక దళాల కార్యాచరణలో అత్యున్నత ప్రమాణాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని జనరల్ రాజా సుబ్రమణి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఆయుధ సామర్థ్యాల పెంపు, శిక్షణ వ్యవస్థల బలోపేతం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. సైనికులు, నావికులు, వాయుసేన సిబ్బంది సంక్షేమంతో పాటు మాజీ సైనికుల సంక్షేమంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం సేవలందించిన ప్రతి ఒక్కరి సంక్షేమం ప్రభుత్వానికి, రక్షణ దళాలకు అత్యంత ముఖ్యమని తెలిపారు. వీరనారుల సంక్షేమం కోసం కొనసాగుతున్న కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు కూడా జనరల్ రాజా సుబ్రమణి స్పష్టం చేశారు. దేశ భద్రత, సైనిక సామర్థ్యాల పెంపు, సిబ్బంది సంక్షేమం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో రక్షణ దళాలు ముందుకు సాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# పెట్రోలియం ఎగుమతులపై విండ్‌ఫాల్ పన్ను తగ్గింపు

## ఆయిల్ కంపెనీలకు ఊరట..

## జూన్ 1 నుంచి కొత్త రేట్లు అమలు

**న్యూఢిల్లీ, మే 31 :** పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతిదారులకు ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై విధిస్తున్న విండ్‌ఫాల్ గైన్స్ పన్నును తగ్గిస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా నిర్ణయం ప్రకారం పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ డ్యూటీని లీటరుకు రూ.1.50 మేర తగ్గించారు. డీజిల్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ.13.50గా నిర్ణయించగా, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై లీటరుకు రూ.9.50 పన్ను విధించనున్నారు. ఈ సవరించిన రేట్లు జూన్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే దేశీయ మార్కెట్‌లో విక్రయించే




పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీలో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సవరణలు కేవలం ఎగుమతులకే పరిమితమని పేర్కొంది. ఇక మరో కీలక నిర్ణయంగా పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విధిస్తున్న రోడ్డు మరియు మౌలిక సదుపాయాల సెస్‌ను పూర్తిగా సున్నాకు తగ్గించింది. దీంతో ఎగుమతిదారులపై పన్ను భారం కొంత మేర తగ్గనుంది.

### విండ్‌ఫాల్ పన్ను ఎందుకు?

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరిగిన సందర్భాల్లో ఆయిల్ కంపెనీలు అసాధారణ లాభాలు పొందకుండా నియంత్రించేందుకు, అలాగే దేశీయ మార్కెట్‌లో ఇంధన లభ్యతను నిర్ధారించేందుకు కేంద్రం విండ్‌ఫాల్ పన్నును అమలు చేస్తోంది. అంతర్జాతీయ చమురు ధరల పరిస్థితులకు అనుగుణంగా ఈ పన్ను రేట్లను ప్రభుత్వం తరచూ సమీక్షిస్తూ వస్తోంది. ప్రస్తుతం గ్లోబల్ చమురు మార్కెట్లు కొంత స్థిరత్వం దిశగా పయనిస్తున్న నేపథ్యంలో ఎగుమతులపై పన్ను భారం తగ్గించేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# విహార యాత్రలో విషాదం

## లోయలో పడిన ట్యాక్సీ

## ఎనిమిది ప్రాణాలు బలి

## గాలింపులో సహాయక బృందాలు

**చంబా, మే 31 :** హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. పర్యాటకులతో వెళ్తున్న ఓ టూరిస్టు ట్యాక్సీ అదుపుతప్పి లోతైన లోయలో పడిపోవడంతో ఈ విషాదం సంభవించింది. మృతుల్లో డ్రైవర్‌తో పాటు ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. బెంగళూరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రెండు కుటుంబాల సభ్యులు ఈ ప్రమాదంలో మృతి చెందినట్లు గుర్తించారు. బైరాగఢ్--సచ్ పాస్ మార్గంలోని కాలాబన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. వేసవి సెలవులను గడిపేందుకు డల్హౌసీ ప్రాంతానికి వచ్చిన రెండు కుటుంబాలు మంచు పర్వతాలను సందర్శించేందుకు ట్యాక్సీలో బయలుదేరాయి. అయితే ప్రయాణం ముగిసిన తర్వాత కూడా వారు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, ట్యాక్సీ యజమాని ఆందోళనకు గురయ్యారు. వాహనంలో అమర్చిన జీపీఎస్ వ్యవస్థను పరిశీలించిన ట్యాక్సీ యజమాని కాలాబన్ ప్రాంతంలో వాహనం కదలకుండా ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు పరిశీలించగా ట్యాక్సీ లోతైన లోయలో పడిపోయినట్లు తేలింది. ప్రమాదం జరిగిన ప్రాంతం అత్యంత దుర్భరమైన కొండ ప్రాంతంగా ఉండటంతో సహాయక చర్యలు కష్టతరంగా మారాయి. మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవడం వల్ల సమాచార మార్పిడి, గాలింపు కార్యక్రమాల్లో ఆటంకాలు ఎదురవుతున్నట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ స్థానికుల సహకారంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎనిమిది



మంది ప్రయాణికులతో వెళ్తున్న వాహనం లోయలో పడిపోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా రంగంలోకి దించామని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం సహాయక బృందాలు ఘటనాస్థలంలో మృతదేహాల కోసం ముమ్మరంగా గాలింపు కొనసాగిస్తున్నాయి. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# భక్తులతో కిటకిటలాడిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

- ప్రత్యేక దర్శనానికి 1–2 గంటలు...
- ధర్మ దర్శనానికి 4 గంటలు

**యాదగిరిగుట్ట మే 31 (రాజముద్ర):**




యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆదివారం భక్తులతో అత్యంత రద్దీగా మారింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్ర ప్రదేశ్ వివిధ ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో నిండిపోయి ఆధ్యాత్మిక వాతావరణం మరింత ఉత్సాహంగా కనిపించింది. స్వామివారి ప్రత్యేక దర్శనం కోసం వచ్చిన భక్తులు సుమారు గంట నుంచి రెండు గంటల వరకు క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో సాధారణ ధర్మదర్శనానికి మూడు నుంచి నాలుగు గంటల వరకు సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. క్యూలైన్లు ఆలయ ప్రాంగణం బయట వరకు విస్తరించడంతో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఆలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇక కొండపైకి చేరే మార్గంలో కూడా భారీగా వాహన రద్దీ కనిపించింది. వాహనాలతో కొండపైకి చేరుకోవడానికి సుమారు ఒక గంట సమయం పడుతోందని వాహనదారులు తెలిపారు. దీంతో కొండపైకి వెళ్లే మార్గంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు.



## బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ బూత్ లెవల్ సన్నాహక సమావేశం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**చర్లపల్లి, రాజముద్ర న్యూస్:**

చర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నేమూరీ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సిరీ ఫంక్షన్ హాల్ చక్రిపురంలో నిర్వహించిన (ఎస్ఐఆర్) అలాగే బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ బూత్ లెవల్ సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సత్యనారాయణ కాలనీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి



**నాగారం, రాజముద్ర న్యూస్:**

ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ లోని సత్యనారాయణ కాలనీ యునైటెడ్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (రి.నెం. 378/2026) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం సత్యనారాయణ కాలనీలో రోడ్ నెం.5, సాయిబాబా గుడి పక్కన ఖాళీ స్థలంలో ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రెవెన్యూ శాఖ రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ యం.వి. రమణ, నూతన అధ్యక్షులు జి. రఘు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి, కె. శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి, ఎం. భద్రు నాయక్,29 మంది కార్యవర్గ సభ్యులతో ఘనంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షులు రఘు ప్రసాద్ మాట్లాడుతూ.. కాలనీలోని మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, భద్రత అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, పంగ హరి బాబు, మాజీ వార్డు సభ్యులు చిన్నం రాజు సాయినాథ్ గౌడ్, చిన్నం రాజు సతీష్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గణపురం కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, టీజేఎస్ పార్టీ అధ్యక్షులు సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి, పంగ సంతోష్, కాలనీ సలహాదారులు కె.వెంకటరత్నం, బి.అంజిరెడ్డి, శంకరప్ప, టీడీపీ నాయకులు ఉమా శంకర్ తదితరులు హాజరయ్యారు.



## పెద్ద మాసాయి అమ్మవారి సేవలో బొంతు శ్రీదేవి

**చర్లపల్లి, రాజముద్ర న్యూస్:**

పెద్ద మాసాయి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్మల మల్లేష్ వారి స్వగృహంలో జరిగిన పెద్దమ్మ పండుగలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఆలయానికి చేరుకునీ అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక అర్చన చేసిన తర్వాత ఆమె మాట్లాడుతూ.. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పొగాకు మానండి – ఆరోగ్యాన్ని కాపాడండి




- గ్రామస్తులకు అవగాహన

**ఆళ్లపల్లి, మే 30 (రాజముద్ర న్యూస్):**

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటీర్ (P.L.V.) గుండెబోయిన రామకృష్ణ ఆళ్లపల్లి మండలంలోని అనంతోగు, రామచంద్రాయ గుంపు గ్రామాల్లో పర్యటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు పొగాకు, గుట్కా, అంబర్ వంటి పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల గురించి వివరించారు. పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని సూచించారు. దీనికి స్పందించిన గ్రామస్థులు, "ముందుగా పొగాకు ఫ్యాక్టరీలు, అంబర్ తయారీ కేంద్రాలను మూసివేస్తే మేమెందుకు తింటాం?" అని ప్రశ్నించారు. దీనికి గుండెబోయిన రామకృష్ణ స్పందిస్తూ, "ప్రజలు పొగాకు ఉత్పత్తులను వినియోగించడం మానేస్తే వాటి తయారీ, విక్రయాలు కూడా సహజంగానే తగ్గిపోతాయి. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి" అని వివరించారు. అనంతరం గ్రామాల్లో ప్రజలతో ముఖాముఖి చర్చలు నిర్వహించి, పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ మాటామంతీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు విశేషంగా స్పందించారు.

## నూతన హెల్త్ స్కీమ్‌పై ఉపాధ్యాయ,ఉద్యోగ లోకం ఆగ్రహం

- 1.5% నిర్బంధ కోతను వెనక్కి తీసుకోవాలి
- సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి:
- టీఎస్ సీపీఎస్ ఈయు జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్

**ఖమ్మం రాజముద్ర న్యూస్..**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్,హెల్త్ కేర్ ట్రస్ట్ అమలు విధానం ఉపాధ్యాయ,ఉద్యోగ వర్గాలలో తీవ్ర గందరగోళానికి,ఆందోళనకు దారితీసిందని,ముందస్తు సమాచారం,స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండా ఏకపక్షంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల బేసిక్ పే నుండి 1.5 శాతం నిర్బంధంగా జీతాల కోత విధించడం అభ్యంతరకరమని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ కార్డుల మంజూరు,వినియోగంపై ప్రభుత్వం నేటికి ఎలాంటి స్పష్టమైన విధివిధానాలు విడుదల చేయలేదని,ఈ పథకం కింద ఏయే కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో ఉచిత వైద్యం అందుతుందో స్పష్టమైన జాబితా లేదని,అదే విధంగా ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి అధికారిక ఒప్పందాలు కూడా చేసుకోలేదన్నారు.దీని ద్వారా సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న సాంకేతిక వివక్ష సరి కాదన్నారు.కనీసం ఉద్యోగుల సమ్మతి (ఆప్షన్) తీసుకోకుండా, అలాగే డీడీఓ లకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిందని మండి పడ్డారు.కనీసం హెల్త్ కార్డులు చేతికి రాకముందే, ముందస్తుగా వేతనాల్లో 1.5% కోత విధించడం అత్యంత దారుణమన్నారు.అదే విధంగా అప్లై చేసినా, చేయకపోయిన భార్యా భర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే ఇద్దరికీ జీతాల్లో కోత విధించడం గర్హనీయమన్నారు.ప్రభుత్వం హెల్త్ కేర్ ట్రస్ట్‌లో తన వంతుగా జమ చేయాల్సిన 1.5% మ్యాచింగ్ గ్రాంట్ నిధులను ముందస్తుగా జమ చేయకుండా, డిఏలు ఇవ్వకుండా, కొత్త పీఆర్సీ ఊసెత్తకుండా ఇలా జీతాల్లో కోతలు పెట్టడం అక్షేపణీయమని వెల్లడించారు.సాధారణ ఓపీఎస్ ఉద్యోగుల తరహాలో సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్నంబర్ ఉండదని,ఈ సాంకేతిక కారణాన్ని చూపుతూ రిటైర్డ్ సీపీఎస్ ఉద్యోగులను ఈ ఉచిత ఆరోగ్య పథకానికి దూరం పెట్టడం సరైనది కాదని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి గందరగోళ పరిస్థితులను అదుపు చేసి,ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# గ్రామీణ ఉపాధి హామీ ఏపీఓనా మజాకా..!

- పన్నెండేళ్లుగా నేలకొండపల్లి మండలంలో తిష్ఠ
- బినామీ పేర్లతో పెద్ద ఎత్తున నిధులు మళ్లింపు
- అసంపూర్తి పనులకు ఎంబిలు,నగదు చెల్లింపులు?
- గత ప్రభుత్వ హయాంలో భారీగా అవకతవకలు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:**

అర్హులైన గ్రామీణ ప్రాంత ప్రజలకు సంవత్సరానికి వంద రోజులపాటు ఉపాధి కల్పిస్తూ గ్రామాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాల్సిన నేలకొండపల్లి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపిఓ(అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్)దారి తప్పింది.అదనపు ఆదాయమే పరమావధిగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ లక్ష్యాలను తుంగలో తొక్కి బినామీలతో కాంట్రాక్ట్ పనులు,ప్రైవేట్ ఇన్సూరెన్స్ వ్యాపారాలు చేస్తూ ఉన్నతాధికారులను టోకరా వేస్తూ రెండు చేతులా సంపాదన మొదలుపెట్టింది.ప్రభుత్వ ఉద్యోగి ప్రైవేటు వ్యాపారాలు చేయవద్దనే ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ దొరికితేనే దొంగ అన్న చందంగా భవిష్యత్ లో సాంకేతికంగా దొరకకుండా ఉండేందుకు కుటుంబ సభ్యులు పేరుతో బహుళ వ్యాపారాలు చేస్తూండడంతో గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్దేశ్యం నిరుపయోగంగా మారింది.దీనికి తోడు ఉపాధి హామీ పథకానికి పిఓగా వ్యవహరిస్తున్న ఎంపీడీఓ కాగితాల పై సంతకాలకు మాత్రమే పరిమితం కావడంతో అన్నీ తానై ఇష్టారాజ్యంగా వ్యవహరించింది.దీంతో ఒకటి,రెండు కాదు ఏకంగా మండలంలోని ముప్పై రెండు గ్రామ పంచాయితీల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులు పారదర్శకంగా జరుగక కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందంటే నమ్మశక్యం కాదు.




**నిర్మాణాల నుండి నేమ్ బోర్డు వరకు మాయాజాలం**

నేలకొండపల్లి మండలంలో పని చేసిన ఎంతోమంది ఎంపిడిఓలు వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన సరే ఏపీఓకి మాత్రం స్థానచలనం లేదు.గత పన్నెండేళ్లుగా ఇదే మండలంలో తిష్ట వేసిన ఏపిఓ తెలివిగా వ్యవహరించి వచ్చిన అవకాశాలను ఆర్థిక వనరులుగా మార్చుకుంది.మండలం పై పూర్తి స్థాయిలో పట్టు సాధించడంతో 2019 సంవత్సరంలో గెలుపొందిన సర్పంచులు,అదే సమయంలో విధుల్లో చేరిన జూనియర్ పంచాయితీ కార్యదర్శిలు అంతా కొత్తవారే కావడంతో ఇక ఆమె బినామీ కార్యకలాపాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది.నిర్మాణాల నుండి నేమ్ బోర్డుల వరకు బినామీ పేర్లతో చేసిన మాయాజాలం అంతా ఇంతా కాదు. మెటీరియల్ వర్కుల్లో ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు,పశువుల పాక, కంపోస్ట్ షెడ్లు,క్రిమిటోరియం,పంట కల్లాల నిర్మాణంతో పాటుగా మొక్కల పెంపకం,పల్లెప్రకృతి వనం,పంట,వరద కాలువలు,చెరువు పూడిక,ఫారం పాండ్,భూమి చదును వంటి పనులకు నేమ్ బోర్డులు ఏర్పాటు చేసి బినామీ పేర్లతో పెద్ద ఎత్తున నిధులను పక్కదారి పట్టించిన విషయం నాడు పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది.అలాగే నాణ్యత పాటించని,అసంపూర్తి మెటీరియల్ వర్కులకు ఎంబిలు చేసి గుత్తేదారుల నుండి కమీషన్ రూపంలో వసూళ్లకు పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది.జిల్లా ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపడితే మరెన్నో అక్రమాలు వెలుగులోకి రావడం ఖాయం.

# ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పాలన విఫలం

## మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి





- మేడిపల్లి డివిజన్ వినాయక నగర్ లో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- అధికార పార్టీపై ధ్వజమెత్తిన మాజీ మేయర్
- ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన పోరాడుతాం

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ వినాయక్ నగర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలతో కలిసి విస్తృత స్థాయి ప్రజా పర్యటన నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ స్థానికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించారు.

**తాగునీటి సమస్యతో అల్లాడుతున్న ప్రజలు:**

కాలనీలో ప్రధాన సమస్యగా తాగునీటి కొరత ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నుంచి ఐదు రోజులకోసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతుండటంతో ముఖ్యంగా వృద్ధులు, మహిళలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని, దీనివల్ల అదనపు ఆర్థిక భారం పడుతోందని ప్రజలు వాపోయారు. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు వెంటనే స్పందించి కనీసం వారానికి రెండు రోజులైనా క్రమబద్ధమైన నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.



**విద్యుత్ స్తంభాల సమస్యతో ప్రమాద భయం:**

కాలనీలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయి నెలల తరబడి అలాగే ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు, వృద్ధులు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో దెబ్బతిన్న స్తంభాలు ఉండటం వల్ల ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొందన్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

**చెత్త కుప్పలతో దయనీయంగా పారిశుద్ధ్యం:**

వినాయక్ నగర్‌లోని అనేక గల్లీలు, ఖాళీ స్థలాలు చెత్త కుప్పలతో నిండిపోయిన దృశ్యాలను బీఆర్ఎస్ నాయకులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్ల మధ్యలో ఉన్న ఖాళీ ప్లాట్లలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని స్థానికులు వివరించారు. చెత్త కుప్పల్లో పందులు, ఎలుకలు, వీధి కుక్కలు సంచరిస్తూ ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని, చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారని ప్రజలు మండిపడ్డారు.

**ఇందిరమ్మ ఇళ్లపై ప్రజల ఆవేదన:**

ప్రజా పర్యటన సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా పలువురు స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇల్లు వస్తుందనే ఆశతో దరఖాస్తు చేసుకున్న పేద కుటుంబాలకు వివిధ కారణాలు చూపుతూ అన్యాయం జరుగుతోందని వాపోయారు. "ఇందిరమ్మ ఇల్లు కావాలని అడిగితే పేదవాడి పరిస్థితిని చూడకుండా, 'నీ ఇల్లాలు మెడలో పుస్తెల తాడు ఉందిగా' అని కాంగ్రెస్ నాయకులు సమాధానం చెబుతున్నారు. సొంత ఇల్లు లేని కుటుంబం కష్టాలు కనిపించడం లేదు కానీ మహిళ మెడలో ఉన్న పుస్తెల తాడు మాత్రం కనిపిస్తోంది. పేదల కన్నీళ్లను తు డవాల్సిన ప్రభుత్వం అర్హులను అనర్హులుగా మార్చే పనిలో పడింది. ఇదేనా కాంగ్రెస్ చెప్పిన సామాజిక న్యాయం? ఇదే నా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు?" అని ప్రశ్నించారు.

**అధికారుల తక్షణ స్పందన:**

ప్రజల సమస్యలను విన్న బీఆర్ఎస్ నాయకులు వెంటనే మున్సిపల్, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి పరిస్థితి తీవ్రతను వివరించారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చెత్త తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యుత్ శాఖ అధికారులు దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వగా, జలమండలి అధికారులు నీటి సరఫరా సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణ పథకాల వంటి అంశాల్లో ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, కొడె పోచయ్య, నాయకులు జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, మల్లం వెంకటేష్, మేడబోయిన విజయ్ కుమార్, తిరుపతి రెడ్డి, అక్కల శ్రీనివాస్, ఆంజనేయులు, యాసారం శ్రీనివాస్, శ్యామల శ్రీనివాస్, బుల్లెట్ శంకర్, మునికుంట్ల కిరణ్ గౌడ్, కోనేటి వెంకన్న, పింగళి జోగిరెడ్డి, గడీల జగన్ రెడ్డి, పాశం నరేందర్ రెడ్డి, సతీష్, శ్రీనివాస్ రెడ్డి, రాయల అశోక్, అమర్ పటేల్, తిరుమలేష్, మధుసూదన్, పుల్ల శ్రీనివాస్, వారికల శ్రీనివాస్, కైసర్, తదితరులు పాల్గొన్నారు.

# హోటళ్లు, రెస్టారెంట్లపై సివిల్ సప్లై అధికారులకు ప్రేమ ఎందుకో..?



**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

పాలేరు: సాధారణంగా వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. అదేవిధంగా ప్రభుత్వ అధికారులు సైతం అదే నిబంధనలతో విధులను నిర్వర్తించవలసి ఉంటుంది. కానీ నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లోని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా నిబంధనలకు తూట్లు పొడుస్తూ కమర్షియల్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నప్పటికీ సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### నిబంధనలు హోటళ్లకు వర్తించవా?:

సాధారణంగా గృహ వినియోగం కోసం ప్రభుత్వం సబ్సిడీతో అందించే డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం చట్టవిరుద్ధం. అయినప్పటికీ పట్టణంలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం కమర్షియల్ సిలిండర్లను వినియోగించాల్సిన చోట డొమెస్టిక్ సిలిండర్లు దర్శనమివ్వడం వెనుక భారీ అక్రమ వ్యవస్థ పనిచేస్తుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**45 రోజుల నిబంధన సామాన్యులకేనా?**

ఇటీవల కాలంలో గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకసారి డొమెస్టిక్ సిలిండర్ పొందిన తర్వాత మరో సిలిండర్ కోసం సుమారు 45 రోజుల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి. సాధారణ కుటుంబాలే ఈ పరిస్థితిలో ఇబ్బందులు పడుతుంటే, రోజుకు వందలాది మందికి ఆహారం తయారు చేసే హోటళ్లు, రెస్టారెంట్ల అవసరాలు ఎలా తీరుతున్నాయన్న ప్రశ్న తలెత్తుతోంది. సగటున ఒక హోటల్‌కు ఒక్కో డొమెస్టిక్ సిలిండర్ రెండు నుంచి మూడు రోజులు మాత్రమే వస్తుంది. ఈ లెక్కన 45 రోజులకు కనీసం 15 నుంచి 20 సిలిండర్లు అవసరం. అయితే కమర్షియల్ సిలిండర్ల వినియోగం పెద్దగా కనిపించకపోవడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

**డొమెస్టిక్ సిలిండర్లు ఎవరు సరఫరా చేస్తున్నారు?:**

హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగిస్తున్న డొమెస్టిక్ సిలిండర్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటిని ఎవరు సరఫరా చేస్తున్నారు? అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. సాధారణ వినియోగదారులకు 45 రోజుల నిబంధన అమలవుతుంటే, వాణిజ్య సంస్థలకు మాత్రం అవసరమైనన్ని సిలిండర్లు ఎలా అందుతున్నాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది గ్యాస్ ఏజెన్సీల ప్రమేయం ఉండొచ్చని, మరికొందరు మధ్యవర్తుల ద్వారా అక్రమ సరఫరా జరుగుతుందనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### ఆకస్మిక తనిఖీలు చేస్తే వందల సిలిండర్లు బయటపడతాయి

అధికారులు హోటల్స్, రెస్టారెంట్స్ నిర్వాహకులకు ముందస్తు సమాచారం లేకుండా ఏకకాలంలో ఆకస్మిక దాడులు చేస్తే వందల డొమెస్టిక్ సిలిండర్లు బయటపడతాయనేది వాస్తవమని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు నిఘా తప్పనిసరి అని, ఆ దిశగా అధికారులు ముందుకు సాగాలని కోరుతున్నారు.

### సివిల్ సప్లై అధికారుల మౌనం వెనుక కారణాలేంటి?

హోటళ్లు, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగంపై ఎన్నో ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత సివిల్ సప్లై అధికారులు ఇప్పటివరకు స్పందించిన దాఖలాలు కనిపించడం లేదు. మచ్చుకైనా ఒక్క హోటల్లో తనిఖీ చేసి డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న ఘటన గానీ, కేసులు నమోదు చేసిన సంఘటన గానీ ప్రజలకు తెలియరాలేదని స్థానికులు పేర్కొంటున్నారు. కొందరు నిర్వాహకులపై అధికారులు ప్రత్యేక సానుభూతి చూపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తాం: పౌరసరఫరాల శాఖ**

ఖమ్మం పాలేరు నియోజకవర్గంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్న విషయంపై ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హోటళ్లు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలి. డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఆర్టీసీ కార్మికులకు తీపి కబురు ..

## ప్రభుత్వంలో విలీనంపై మంత్రి పొన్నం కీలక ప్రకటన

**పెద్దపల్లి, మే 31:**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లాలో మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి ఆయన మంథని బస్ స్టేషన్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెద్దపల్లి డిపో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సబ్ కమిటీ సమీక్ష నిర్వహించిందని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలు కుంభమేళా తరహాలో జరగనున్న నేపథ్యంలో, వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రజా రవాణాకు లైఫ్‌లైన్ అయిన ఆర్టీసీకి సంబంధించి బాసర నుంచి భద్రాచలం వరకు ప్రతి బస్టాండ్‌ను, డిపోను నవీకరిస్తున్నామని చెప్పారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, భద్రత, అలాగే ఆర్టీసీ సంస్థ పరిరక్షణ అనే మూడు ప్రధాన అంశాలపై ఎక్కడా ఇబ్బంది లేకుండా ముందుకుపోతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీలో కొత్త నియామకాలు చేపడుతున్నామని, కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే 310 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. ఇక ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన మంత్రి పొన్నం స్పష్టం చేశారు. ప్రజాస్వామిక హక్కు అయిన గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి, ఆయా సంఘాల ప్రతినిధులతో అధికారుల కమిటీతో భేటీ అయి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



# బంగారం స్థిరం

## వెండి ధరల్లోనూ మార్పుల్లేవు

**హైదరాబాద్, మే 31 :** అంతర్జాతీయ ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిణామాల మధ్య బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్నప్పటికీ, పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారంపై డిమాండ్ తగ్గడం లేదు. దీంతో దేశీయ మార్కెట్‌లో పసిడి ధరలు ఉన్నత స్థాయిలో కొనసాగుతున్నాయి. మార్కెట్ వర్గాల అంచనాల ప్రకారం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణ భయాలు, కేంద్ర బ్యాంకుల బంగారం కొనుగోళ్లు పసిడి ధరలకు మద్దతుగా నిలుస్తున్నాయి. దీంతో బంగారం ధరల్లో పెద్దగా మార్పులు కనిపించకపోయినా, రికార్డు స్థాయిలకు సమీపంలోనే కొనసాగుతున్నాయి. గుడ్ రిటర్న్స్ గణాంకాల ప్రకారం ఆదివారం ఉదయం నాటికి హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,040గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,43,950గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలు స్వల్పంగా ఎక్కువగా ఉన్నాయి. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,57,190కు చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,100గా కొనసాగుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, వివిధ దేశాల మధ్య కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లలో పెరుగుతున్న అస్థిరత కారణంగా బంగారం ధరలు సమీప భవిష్యత్తులో కూడా బలంగానే కొనసాగే అవకాశం ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా ప్రస్తుతం స్థిరంగానే ఉన్నాయి. పరిశ్రమల వినియోగం, పెట్టుబడి డిమాండ్ రెండింటి ప్రభావంతో వెండి ధరలు ఉన్నత స్థాయిలో కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,90,000గా ఉంది. చెన్నైలో కూడా కిలో వెండి ధర ఇదే స్థాయిలో రూ.2,90,000గా కొనసాగుతోంది. అదే సమయంలో ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో కిలో వెండి ధర రూ.2,80,000గా నమోదైంది. వివిధ ప్రాంతాల్లో స్థానిక పన్నులు, రవాణా వ్యయాలు, డిమాండ్ ఆధారంగా ధరల్లో స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. బంగారం, వెండి ధరలు ప్రస్తుతం అత్యున్నత స్థాయిల్లో కొనసాగుతున్న నేపథ్యంలో ఆభరణాల కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు మార్కెట్ పరిస్థితులను గమనించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పెట్టుబడి పరంగా చూస్తే, దీర్ఘకాలికంగా బంగారం ఇప్పటికీ సురక్షిత ఆస్తిగానే పరిగణించబడుతోందని ఆర్థిక విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్నారా?

### ఒక్క తప్పుతో బ్యాంక్ ఖాతా ఖాళీ కావచ్చు..!

**హైదరాబాద్, మే 31 :** డిజిటల్ చెల్లింపులు వేగంగా పెరుగుతున్న ఈ రోజుల్లో క్యూఆర్ కోడ్‌ల వినియోగం సాధారణమైపోయింది. కిరాణా దుకాణాల నుంచి షాపింగ్ మాల్స్ వరకు, పార్కింగ్ ఫీజుల నుంచి రెస్టారెంట్ బిల్లుల వరకు ప్రతిచోటా క్యూఆర్ కోడ్‌ల ద్వారానే చెల్లింపులు జరుగుతున్నాయి. అయితే ఇదే సౌలభ్యాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సైబర్ భద్రతా సంస్థల సమాచారం ప్రకారం, నకిలీ క్యూఆర్ కోడ్‌ల ద్వారా వినియోగదారుల బ్యాంకు ఖాతా వివరాలు, యూపీఐ పిన్‌లు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని దోచుకునే ఘటనలు పెరుగుతున్నాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే అందులో కనిపించే లింక్‌ను పరిశీలించకుండా ఓపెన్ చేయడం వల్ల చాలామంది మోసపోతున్నారు. ఈ తరహా మోసాన్ని "క్విషింగ్" అని పిలుస్తున్నారు. అసలైన క్యూఆర్ కోడ్‌లా కనిపించే నకిలీ కోడ్‌లను ఏర్పాటు చేసి, వినియోగదారులను మోసపూరిత వెబ్‌సైట్లకు మళ్లిస్తారు. అక్కడ బ్యాంకింగ్ సమాచారం, కార్డు వివరాలు, యూపీఐ పిన్ వంటి వివరాలు నమోదు చేయమని కోరుతారు. బాధితులు ఆ వివరాలు నమోదు చేసిన వెంటనే వారి ఖాతాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. నిపుణుల సూచనల ప్రకారం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత తెరపై కనిపించే వెబ్‌సైట్ చిరునామాను జాగ్రత్తగా పరిశీలించాలి. బ్రాండ్ పేర్లలో చిన్న మార్పులు, అనవసర అక్షరాలు లేదా అనుమానాస్పద డొమైన్‌లు కనిపిస్తే వెంటనే ఆ ప్రక్రియను నిలిపివేయాలి. అలాగే సాధారణ చెల్లింపుల కోసం ఓటీపీ, పూర్తి బ్యాంకు వివరాలు లేదా యాప్ డౌన్‌లోడ్ అవసరం ఉండదని నిపుణులు చెబుతున్నారు. అలాంటి అభ్యర్థనలు వస్తే అది మోసపూరిత చర్యగా భావించి అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇమెయిల్స్, ఎస్ఎంఎస్‌లు లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చిన "బహుమతి గెలిచారు", "ప్రత్యేక డిస్కౌంట్", "ఖాతా వెరిఫికేషన్" వంటి సందేశాల్లోని క్యూఆర్ కోడ్‌ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.



# చికెన్ ధరలు సామాన్యులకు ఊరట

### తెలుగు రాష్ట్రాల్లో స్థిరంగా మార్కెట్



**హైదరాబాద్, మే 31 :** తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ప్రస్తుతం సామాన్య ప్రజలకు అందుబాటులోనే కొనసాగుతున్నాయి. గత కొద్ది నెలలుగా పౌల్ట్రీ రంగంలో నెలకొన్న స్థిరత్వం, మార్కెట్‌లో సరఫరా మెరుగుపడటం, వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి పెరగడం వంటి కారణాలతో చికెన్ ధరలు నియంత్రణలో ఉన్నాయి. దీంతో మాంసాహార ప్రియులకు ప్రస్తుతం కొంత ఊరట లభిస్తోంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ధరలను పరిశీలిస్తే హైదరాబాద్‌లో స్కిన్‌లెస్ చికెన్ కిలో ధర రూ.250 నుంచి రూ.280 మధ్య కొనసాగుతోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో డిమాండ్‌ను బట్టి ధరల్లో స్వల్ప మార్పులు కనిపిస్తున్నప్పటికీ, మొత్తం మీద మార్కెట్ స్థిరంగానే ఉంది. వారాంతాల్లో కొంత డిమాండ్ పెరిగినా ధరల్లో పెద్దగా పెరుగుదల నమోదు కావడం లేదు. వరంగల్, ఖమ్మం వంటి పట్టణాల్లో చికెన్ కిలో ధర సుమారు రూ.250 వద్ద కొనసాగుతోంది. ఈ ప్రాంతాల్లో స్థానిక పౌల్ట్రీ ఫామ్‌ల నుంచి సరఫరా సమృద్ధిగా ఉండటంతో ధరలు అదుపులో ఉన్నాయి. వినియోగదారుల కొనుగోలు శక్తిని దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు కూడా అధిక ధరలకు విక్రయించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో అత్యల్ప ధరలు నమోదవుతున్నాయి. అక్కడ కిలో చికెన్ ధర సుమారు రూ.220గా ఉండటం గమనార్హం. స్థానికంగా ఉత్పత్తి అధికంగా ఉండటం, సరఫరా సులభంగా అందుబాటులో ఉండటం ఇందుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. విశాఖపట్నంలో చికెన్ ధర కిలోకు రూ.250 వద్ద స్థిరంగా ఉంది. నగరంలో డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పటికీ సరఫరా కూడా తగిన స్థాయిలో ఉండటంతో ధరలు అదుపులోనే కొనసాగుతున్నాయి. రాజమండ్రి, చిత్తూరు వంటి ప్రాంతాల్లో మాత్రం కిలో చికెన్ ధర రూ.280 వరకు పలుకుతోంది. రవాణా ఖర్చులు, స్థానిక డిమాండ్, వ్యాపార పరిస్థితులను బట్టి అక్కడ ధరలు కొంత ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు గుడ్ల ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో ఒక్క గుడ్డు ధర సుమారు రూ.6గా నమోదవుతోంది. పౌల్ట్రీ రంగంలో ఉత్పత్తి సాధారణ స్థాయిలో కొనసాగుతుండటంతో గుడ్ల ధరల్లో కూడా పెద్ద మార్పులు కనిపించడం లేదు. పౌల్ట్రీ రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ ఏడాది వేసవి తీవ్రత కొంత తగ్గడం, ఫామ్‌లలో మెరుగైన నిర్వహణ పద్ధతులు అమలు చేయడం, కోళ్ల మరణాల శాతం తగ్గడం వంటి అంశాలు ఉత్పత్తి స్థిరత్వానికి దోహదపడ్డాయి. గతంలో వాతావరణ మార్పులు, వ్యాధుల ప్రభావంతో సరఫరాలో అంతరాయాలు ఏర్పడి ధరలు పెరిగేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేకపోవడంతో మార్కెట్ ప్రశాంతంగా కొనసాగుతోంది. వ్యాపార వర్గాల అంచనాల ప్రకారం రాబోయే కొన్ని వారాలపాటు కూడా చికెన్ ధరల్లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. పండుగలు లేదా ప్రత్యేక సందర్భాల్లో డిమాండ్ పెరిగితే స్వల్ప పెరుగుదల కనిపించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం సరఫరా బలంగా ఉండటంతో వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. చికెన్, గుడ్ల ధరలు అందుబాటులో ఉండటంతో కుటుంబాల ఆహార వ్యయంపై అదనపు భారం పడకుండా ఉండటమే కాకుండా, పౌల్ట్రీ రంగానికి కూడా స్థిరమైన ఆదాయం లభించే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ముగ్గురికీ ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

# టయోటా నుంచి సరికొత్త విద్యుత్ కారు




**న్యూఢిల్లీ, మే 31 :** దేశీయ విద్యుత్ వాహనాల విభాగంలో పోటీ రోజురోజుకూ పెరుగుతున్న వేళ ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టయోటా మరో సరికొత్త విద్యుత్ కారును భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. 'ఎబెల్లా' పేరుతో విడుదల చేసిన ఈ ఆధునిక విద్యుత్ వాహనం ఆకర్షణీయమైన రూపకల్పన, అధునాతన సాంకేతికత, మెరుగైన భద్రతా ప్రమాణాలతో వినియోగదారులను ఆకట్టుకునేలా రూపొందించబడింది. ఈ కొత్త కారు ప్రారంభ ధరను రూ.23.60 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. వివిధ అవసరాలకు అనుగుణంగా మూడు వేరియంట్లలో ఈ వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యుత్ వాహనాలను కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు ఇది మరో ఆకర్షణీయమైన ఎంపికగా మారనుందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. టయోటా ఎబెల్లాలో రెండు రకాల బ్యాటరీ ఎంపికలను అందిస్తోంది. 61 కిలోవాట్ గంటల సామర్థ్యం గల బ్యాటరీతో కూడిన మోడల్ ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 541 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ తెలిపింది. దీర్ఘదూర ప్రయాణాలు చేసే వినియోగదారులకు ఈ మోడల్ మరింత అనుకూలంగా ఉండనుంది. అదే విధంగా 49 కిలోవాట్ గంటల బ్యాటరీతో రూపొందించిన మరో మోడల్ ఒక్కసారి ఛార్జింగ్‌తో 344 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. పట్టణ ప్రాంతాల్లో రోజువారీ వినియోగానికి ఈ మోడల్ అనువైనదిగా కంపెనీ పేర్కొంది. వాహన అంతర్గత సౌకర్యాల విషయంలో కూడా టయోటా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థతో పాటు 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లేను అందించింది. డ్రైవింగ్ అనుభవాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు ముందు భాగంలో వెంటిలేటెడ్ సీట్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా స్థిర గాజు పైకప్పు, వైర్‌లెస్ మొబైల్ ఫోన్ ఛార్జింగ్ సదుపాయం, వైర్‌లెస్ యాపిల్ కార్ కనెక్టివిటీ, ఆండ్రాయిడ్ ఫోన్ అనుసంధాన వ్యవస్థ, గాలి శుద్ధి యంత్రం, స్వయంచాలక శీతలీకరణ వ్యవస్థ వంటి ఆధునిక సౌకర్యాలను ఈ కారులో పొందుపరిచారు. భద్రతా అంశాలకు కూడా కంపెనీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. ప్రయాణికుల రక్షణ కోసం ఏడు గాలితిత్తులు, నాలుగు చక్రాలకు డిస్క్ బ్రేకింగ్ వ్యవస్థ, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, ఆధునిక నియంత్రణ వ్యవస్థలు వంటి పలు భద్రతా ఫీచర్లను అందించింది. భారతదేశంలో విద్యుత్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో టయోటా ఎబెల్లా విడుదల ప్రాధాన్యత సంతరించుకుంది. అధిక ప్రయాణ దూరం, ఆధునిక సాంకేతిక సదుపాయాలు, మెరుగైన భద్రతా ప్రమాణాలు కలగలిపిన ఈ వాహనం దేశీయ విద్యుత్ వాహనాల విభాగంలో కీలక పోటీదారుగా నిలిచే అవకాశాలు ఉన్నాయని ఆటోమొబైల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పండుగ సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ విక్రయాలకు భారీ దెబ్బ!



**న్యూఢిల్లీ, మే 31 :** దేశవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌కు ధరల పెంపు ప్రభావం తీవ్రంగా తాకే సూచనలు కనిపిస్తున్నాయి. రూపాయి విలువ క్షీణించడం, దిగుమతి వ్యయాలు పెరగడం వల్ల మొబైల్ తయారీ సంస్థలు వరుసగా ధరలను పెంచుతున్న నేపథ్యంలో వినియోగదారులు కొత్త ఫోన్ల కొనుగోలుపై వెనక్కి తగ్గుతున్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఈ పరిస్థితి కొనసాగితే రాబోయే పండుగల సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు దాదాపు 30శాతం వరకు పడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. త్రైకిన్ టెక్నాలజీ, టెకేర్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా సుమారు ఆరు వేల మంది చురుకైన మొబైల్ కొనుగోలుదారుల అభిప్రాయాలను సేకరించి రూపొందించిన ఈ నివేదికలో వినియోగదారుల కొనుగోలు ధోరణిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నట్లు వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 48 శాతం మంది వచ్చే ఆరు నెలల్లో కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలును వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరల కారణంగా ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఫోన్‌ను మరికొంతకాలం కొనసాగించాలనే నిర్ణయానికి చాలామంది వచ్చారని నివేదిక పేర్కొంది. మరోవైపు కేవలం ఆరు శాతం మంది మాత్రమే తమ పాత ఫోన్‌ను మార్పిడి చేసి కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రస్తుతం రూ.20 వేల లోపు ధర కలిగిన స్మార్ట్‌ఫోన్ల ధరలు సగటున 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగినట్లు అధ్యయనంలో తేలింది. ఈ ధరల పెరుగుదల మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వినియోగదారులపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పండుగల సమయంలో భారీగా కొనుగోళ్లు జరిగే విభాగాల్లో డిమాండ్ తగ్గే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. గత ఏడాది కాలంలో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సుమారు ఐదు శాతం మేర క్షీణించింది. దీని ప్రభావం మొబైల్ ఫోన్ తయారీ ఖర్చులపై పడడంతో కంపెనీలు ధరల పెంపు దిశగా అడుగులు వేయాల్సి వచ్చిందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ నిర్ణయం అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని టెకేర్ వ్యవస్థాపకుడు ఫైజల్ కవూసా అభిప్రాయపడ్డారు. నివేదిక ప్రకారం ధరల పెరుగుదల ఇదే స్థాయిలో కొనసాగితే దేశంలో స్మార్ట్‌ఫోన్ డిమాండ్ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. వచ్చే ఆరు నెలల్లో మొత్తం స్మార్ట్‌ఫోన్ విక్రయాలు 11 నుంచి 12 కోట్ల యూనిట్ల మధ్యకు పరిమితమయ్యే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. గత సంవత్సరాలతో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదలగా భావిస్తున్నారు. మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, కొత్త ఫోన్ల ధరలు పెరగడంతో కొంతమంది వినియోగదారులు రెండో చేతి మొబైల్ ఫోన్ల వైపు మొగ్గు చూపుతున్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో ఆరు శాతం మంది సెకండ్‌హ్యాండ్ స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపినట్లు వెల్లడైంది. దీంతో వినియోగించిన ఫోన్ల మార్కెట్‌కు కూడా కొత్త ఊపు వచ్చే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా చూస్తే, స్మార్ట్‌ఫోన్ ధరల పెరుగుదల కేవలం వినియోగదారుల ఖర్చులపైనే కాకుండా మొత్తం మొబైల్ పరిశ్రమ వృద్ధి రేటుపైనా ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. పండుగల సీజన్‌కు ముందు ధరలు స్థిరపడకపోతే మార్కెట్ మరింత మందగించే పరిస్థితి ఏర్పడవచ్చని పరిశ్రమ వర్గాలు హెచ్చరిస్తున్నాయి.




# భార్యల బాధలకు దేవేంద్రుడి పరిష్కారం!

**హైదరాబాద్, మే 31 :** ఓటీటీ ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తిన ప్రముఖ హాస్య ధారావాహిక 'సేవ్ ది టైగర్స్'ఇప్పుడు మూడో సీజన్‌తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రెండు భాగాలతో విశేష ఆదరణ పొందిన ఈ సిరీస్, ఈసారి మరింత వినోదం, కొత్త కథా మలుపులు, ఊహించని ఫాంటసీ అంశాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జూన్ 19 నుంచి ప్రముఖ డిజిటల్ వేదికలో ప్రసారం కానున్న ఈ సిరీస్‌కు సంబంధించిన ప్రచార చిత్రాన్ని తాజాగా విడుదల చేయగా, అది సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందనను సొంతం చేసుకుంటోంది. ప్రచార చిత్రం ప్రారంభం నుంచే వినోదభరితంగా సాగుతుంది. పెళ్లి తర్వాత తమ జీవితాలు ఎలా మారిపోయాయో ముగ్గురు స్నేహితులు సరదాగా చెప్పుకునే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. కుటుంబ జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సంఘటనలను హాస్యంతో మేళవిస్తూ కథను ముందుకు తీసుకెళ్లిన విధానం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గత రెండు సీజన్లలో మాదిరిగానే ఈసారి కూడా భార్యాభర్తల మధ్య జరిగే సరదా సంఘటనలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అయితే ఈ సీజన్‌లో ప్రత్యేకత ఏమిటంటే ఫాంటసీ అంశాల కలయిక. ఒక సందర్భంలో స్వర్గలోకంలోని దేవేంద్రుడి పాత్రలో ప్రముఖ హాస్య నటుడు వెన్నెల కిషోర్ కనిపించడం కథకు కొత్త మలుపును తీసుకువచ్చింది. అతని ప్రవేశం తర్వాత ముగ్గురు స్నేహితుల జీవితాలు పూర్తిగా మారిపోతాయి. సాధారణ జీవితాన్ని గడుపుతున్న వారు ఒక్కసారిగా సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడం కథలో ప్రధాన ఆసక్తికర అంశంగా మారింది. ఒకరు ప్రజాప్రతినిధిగా ఎదగగా, మరొకరు ప్రముఖ రచయితగా గుర్తింపు పొందుతారు. ఇంకొకరు భారీ సంస్థకు ప్రధాన కార్యనిర్వాహక అధికారిగా బాధ్యతలు చేపడతారు. ఈ మార్పులు నిజంగానే జరిగాయా? లేక దైవకృపతో వచ్చిన అద్భుత పరిణామాలా? అన్న ప్రశ్నలకు సమాధానంగా కథ సాగనున్నట్లు ప్రచార చిత్రం ద్వారా తెలుస్తోంది. హాస్యంతో పాటు భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, సామాజిక వ్యంగ్యం కూడా ఈసారి కథలో చోటు చేసుకున్నాయి. ప్రధాన పాత్రల్లో నటించిన ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్య కృష్ణ మరోసారి తమ సహజ నటనతో ఆకట్టుకున్నారు. వీరి భార్యల పాత్రల్లో నటించిన పావని గంగిరెడ్డి, జోర్దార్ సుజాత, దేవియాని శర్మలు కూడా కథకు బలంగా నిలిచారు. గత సీజన్లలో వీరి పాత్రలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించగా, ఈసారి మరింత బలమైన పాత్రలతో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ ధారావాహికను ప్రముఖ దర్శకుడు మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం రూపొందించగా, శ్రీరామ్ ఎరగం దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. కుటుంబ ప్రేక్షకులను, యు-వతను ఒకేసారి ఆకట్టుకునేలా కథను మలిచిన విధానం ప్రత్యేకంగా కనిపిస్తోంది. ప్రచార చిత్రం విడుదలైన తర్వాత ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. గత రెండు సీజన్లు డిజిటల్ వేదికలో సంచలన విజయాలు నమోదు చేసిన నేపథ్యంలో, మూడో సీజన్ కూడా అదే స్థాయిలో ఆదరణ పొందుతుందనే నమ్మకంతో నిర్మాతలు ఉన్నారు. హాస్యం, కుటుంబ అనుబంధాలు, ఫాంటసీ అంశాల సమ్మేళనంగా రూపొందిన ఈ సిరీస్ మరోసారి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేందుకు సిద్ధమవుతోంది. జూన్ 19 నుంచి ప్రారంభమయ్యే ఈ కొత్త ప్రయాణం ఓటీటీ ప్రపంచంలో మరో విజయగాథగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# బన్నీ పొలిటికల్ ఎంట్రీ?

## అభిమానుల్లో ఆసక్తి రేపుతున్న ప్రచారం



తెలుగు చలనచిత్ర పరిశ్రమకు రాజకీయాలతో ఉన్న అనుబంధం కొత్తది కాదు. గతంలో అనేక మంది సినీ ప్రముఖులు ప్రజాదరణను రాజకీయ విజయంగా మలుచుకుని ప్రజా జీవితంలో తమదైన ముద్ర వేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టడం, తమిళ సినీ నటుడు విజయ్ సొంత రాజకీయ పార్టీ స్థాపించి రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించడం వంటి పరిణామాల నేపథ్యంలో మరో టాలీవుడ్ స్టార్ హీరో రాజకీయ ప్రవేశంపై ఆసక్తికర చర్చ మొదలైంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారనే ప్రచారం ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు, సినీ వర్గాల్లో విస్తృతంగా చర్చనీయాంశమవుతోంది. అల్లు అర్జున్‌కు దేశవ్యాప్తంగా ఉన్న అభిమాన వర్గం, ముఖ్యంగా 'పుష్ప' సినిమాతో సాధించిన అంతర్జాతీయ గుర్తింపు కారణంగా ఆయన భవిష్యత్తు రాజకీయ ప్రస్థానంపై ఊహాగానాలు మరింత వేగం పుంజుకున్నాయి. సినీ రంగంలోనే కాకుండా యువతలో, సామాజిక మాధ్యమాల్లో ఆయనకు ఉన్న అపారమైన ఆదరణను దృష్టిలో ఉంచుకుని రాజకీయ రంగప్రవేశం చేసే అవకాశాలపై అనేక కథనాలు వెలువడుతున్నాయి. సినీ, రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, తమిళనాడులో విజయ్ అనుసరిస్తున్న వ్యూహాన్ని అధ్యయనం చేస్తూ, దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళ్లాలనే ఆలోచనలో అల్లు అర్జున్ ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. రాజకీయ వ్యూహకర్తలతో ఇటీవల కొన్ని సమావేశాలు జరిగినట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ సమావేశాలకు సంబంధించి ఎలాంటి అధికారిక సమాచారం బయటకు రాలేదు. అయినప్పటికీ భవిష్యత్తులో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే సామాజిక, ప్రజా సేవా కార్యక్రమాల ద్వారా బలమైన వేదికను నిర్మించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ కొనసాగుతోంది. అల్లు అర్జున్‌కు తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణ భారతదేశం మొత్తం, ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో కూడా భారీ అభిమాన గణం ఉంది. 'ఆల్ ఇండియా అల్లు అర్జున్ ఆర్మీ' పేరుతో పనిచేస్తున్న అభిమాన సంఘాలు అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇప్పటికే తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. ఒకవేళ భవిష్యత్తులో రాజకీయాల్లోకి రావాలనే నిర్ణయం తీసుకుంటే, ఇదే అభిమాన బలం ఆయనకు పెద్ద రాజకీయ మూలధనంగా మారే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినీ ప్రముఖుల రాజకీయ ప్రయాణాలను పరిశీలిస్తే, ప్రజాదరణను ఓట్లుగా మార్చుకోవడం అంత సులభమైన విషయం కాదని కూడా రాజకీయ పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన, దీర్ఘకాలిక రాజకీయ కట్టుబాటు, క్షేత్రస్థాయి కార్యకలాపాలు, బలమైన నాయకత్వ లక్షణాలు వంటి అంశాలు కూడా సమానంగా అవసరమని చెబుతున్నారు. అందువల్ల కేవలం అభిమాన బలం మాత్రమే రాజకీయ విజయానికి సరిపోదని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ మాత్రం తన సినీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న పలు చిత్రాల చిత్రీకరణల్లో పాల్గొంటూ ఆయన కెరీర్‌లో అత్యంత కీలక దశను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రవేశంపై వస్తున్న వార్తలపై ఆయన నుంచి గానీ, ఆయన బృందం నుంచి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. గతంలో కూడా ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు వాటిని ఆయన సన్నిహిత వర్గాలు ఖండించిన సందర్భాలు ఉన్నాయి. అయితే అధికారిక ప్రకటనలు లేకుండానే సామాజిక మాధ్యమాల్లో ఈ ప్రచారం విస్తృతంగా చర్చకు దారితీస్తోంది. అభిమానులు ఒకవైపు బన్నీ రాజకీయాల్లోకి వస్తే స్వాగతిస్తామని చెబుతుండగా, మరికొందరు మాత్రం ప్రస్తుతం ఆయన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే అల్లు అర్జున్ రాజకీయ అరంగేట్రంపై వస్తున్న వార్తలు ప్రస్తుతం ఊహాగానాల స్థాయిలోనే ఉన్నప్పటికీ, అవి సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమవుతున్నాయి. భవిష్యత్తులో ఈ ప్రచారానికి సంబంధించి స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన కోసం వేచి చూడాల్సిందే.

# గ్లామర్‌తో మెరిసే యామిని భాస్కర్..



యామిని భాస్కర్ తాజాగా సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. ఆమె పంచుకున్న స్టైలిష్ ఫొటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటూ వైరల్ అవుతున్నాయి. ఆధునిక దుస్తుల్లో, ఆకర్షణీయమైన హావభావాలతో కనిపించిన యామిని ఫొటోలకు నెటిజన్ల నుంచి భారీ స్పందన లభిస్తోంది. విజయవాడకు చెందిన యామిని భాస్కర్ మోడలింగ్ రంగం నుంచి సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 2014లో రభస చిత్రంతో వెండితెరపై కనిపించిన ఆమె, అనంతరం పలు చిత్రాల్లో నటిస్తూ గుర్తింపు సంపాదించారు. 2015లో విడుదలైన కీచక సినిమా ఆమె కెరీర్‌కు కీలక మలుపుగా నిలిచింది. ఆ చిత్రంలో నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. తరువాత కాటమరాయుడు, నర్తశాల, భలే మంచి చౌక బేరం తదితర చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ చురుకుగా ఉండే యామిని, తరచూ ఫ్యాషన్ ఫొటోషూట్లు, వ్యక్తిగత అప్‌డేట్లను అభిమానులతో పంచుకుంటూ తన ఫాలోయింగ్‌ను పెంచుకుంటున్నారు. సంప్రదాయ, ఆధునిక దుస్తుల్లో సమానంగా మెప్పించే నటీమణుల్లో ఆమె ఒకరిగా నిలుస్తున్నారు. తాజా ఫొటోషూట్‌లో స్టైలిష్ లుక్‌తో కనిపించిన యామిని భాస్కర్ అందం, ఆత్మవిశ్వాసం, కెమెరా ముందు చూపిన హావభావాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో ఆమె ప్రేక్షకులను అలరించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# నచ్చిన కథలతోనే ప్రత్యేక గుర్తింపు: యామీ గౌతమ్



బాలీవుడ్‌లో గ్లామర్ కంటే కథ, పాత్రల ఎంపికకు ప్రాధాన్యం ఇచ్చే నటీమణుల్లో యామీ గౌతమ్ ఒకరు. తాను నమ్మని కథలకు ధైర్యంగా 'కాదు' చెప్పడం వల్లే సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించగలిగానని ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ, అవకాశాల కోసం ఎప్పుడూ రాజీపడలేదని తెలిపారు. కథపై పూర్తి నమ్మకం ఉన్నప్పుడే సినిమా అంగీకరిస్తానని, ప్రేక్షకులపై ప్రభావం చూపే పాత్రలకే ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. తన కెరీర్‌లో 2018 కీలక మలుపుగా నిలిచిందని యామీ వెల్లడించారు. ఖతీఱ: ఎష్ట్రవ రాబతీస్త్రఱఝ్రీ క్రొతీఱనివ, ధీఝ్రీఝ చిత్రాల విజయాలు తనకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. ఆ తర్వాత నుంచి సామాజిక సందేశం కలిగిన, ప్రేక్షకులను ఆలోచింపజేసే కథలనే ఎంచుకుంటున్నానని తెలిపారు. "పని లేకపోయినా పర్వాలేదు కానీ, నాకు నమ్మకం లేని కథను కేవలం డబ్బు కోసం చేయను. ప్రతి అవకాశాన్ని అంగీకరించడం కంటే సరైన అవకాశాన్ని ఎంచుకోవడం ముఖ్యం" అని యామీ స్పష్టం చేశారు. మాతృత్వంలోకి అడుగుపెట్టిన తర్వాత కూడా తన ఆలోచనల్లో ఎలాంటి మార్పు రాలేదని ఆమె చెప్పారు. కుటుంబం, వృత్తి రెండింటినీ సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నానని, మంచి కథలు వస్తే భవిష్యత్తులో కూడా విభిన్న పాత్రల్లో కనిపిస్తానని తెలిపారు. అవార్డుల కంటే ప్రేక్షకుల ప్రేమే తనకు అత్యంత విలువైనదని యామీ పేర్కొన్నారు. "అవార్డులు కొన్ని క్షణాల ఆనందాన్ని మాత్రమే ఇస్తాయి. కానీ ప్రేక్షకుల ప్రశంసలు జీవితాంతం గుర్తుండిపోతాయి. వారు చూపించే ప్రేమే ఒక నటుడికి నిజమైన గౌరవం" అని అన్నారు. మహిళా ప్రాధాన్యత ఉన్న కథల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన యామీ గౌతమ్, వినోదంతో పాటు ఆలోచింపజేసే చిత్రాల్లో నటించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. నాణ్యమైన కథల ఎంపికతో కమర్షియల్ విజయాలతో పాటు విమర్శకుల ప్రశంసలను కూడా సమానంగా అందుకుంటూ కొత్తతరం నటీనటులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com